E-KABURU E-PAPER

# ఈ-కబురు

ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం

@ekaburu.com

(తేదీ) 27 -06-2025 (వారం) శుక్రవారం హైదరాబాద్ పేజీలు–6 e-kaburu.com

ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు » 2లో

చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయా? » 4లో



ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా మారదాం: రామ్ చరణ్ » 5లో



జయ్ వర్మతో డేటింగ్ రూమర్స్‌పై హీరోయిన్ క్లారిటీ.. మార్పు వ్యాధి వల్ల.. » 5లో



ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్.. టీమిండియాకు షాకింగ్ న్యూస్..! » 6లో



# డేంజర్‌లో జూరాల ప్రాజెక్ట్.. తెగిన రోప్‌వే..

4వ గేటులో తెగిన ఇనుప రోప్

తాజాగా తెగిన ప్రాజెక్టు 4వ గేటు ఇనుప రోప్

ఇదివరకే తెగిన మరో 8 గేట్ల ఇనుప రోప్‌లు

దెబ్బతిన్న 18 గేట్ల రబ్బర్ సీళ్లు..

ఏడాదిగా లీకేజీలు

ప్రమాదం లేదంటున్న ఇరిగేషన్ అధికారులు



ఈ కబురు, మహబూబ్‌నగర్/గద్వాల: కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి రాష్ట్రంలోనే మొట్టమొదటిదైన ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పాలమూరు జిల్లా వరప్రదాయినిగా నిలుస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడు లక్షలకు పైగా ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ఈ ప్రాజెక్టుకు ఏళ్ల తరబడి మరమ్మతులు కరువయ్యాయి. సుమారు ఏడాది కాలంగా గేట్ల నుంచి నీళ్లు లీకవుతుండగా, తాజాగా నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జూరాల పరిస్థితిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

**దెబ్బతిన్న రోప్‌లు, రబ్బరు సీళ్లు..**

జూరాల ప్రాజెక్ట్‌కు పై నుంచి వచ్చిన నీటిని గానీ, సాగు అవసరాలకు గానీ ఆపరేట్ (పైకెత్తడం) చేయడం ద్వారా దిగువకు నీరు విడుదల చేసేలా సులభతరమైన విధానంలో మొత్తం 62 గేట్లను అర్ధ చంద్రాకారంల్లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

తరువాయి 2లో



# ఈగల్ ఉంది జాగ్రత్త: సీఎం రేవంత్

'ఈగల్' లోగోను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరిక

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఇకపై 'ఈగల్'

తెలంగాణ గడ్డపై మాదక ద్రవ్యాల ఆలోచన చేస్తే వెన్ను విరుస్తాం

మత్తు ముఠాలు రాష్ట్రంలోకి రావాలంటే వణికిపోవాలి

స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ మూలాలు గుర్తిస్తే కేసులు

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో సీఎం..

హాజరైన రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ

ఈ కబురు, హైదరాబాద్: 'నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యత స్వీకరించిన వెంటనే సమీక్ష పెట్టి మరీ హెచ్చరించా..తెలంగాణ గడ్డపై మాదక ద్రవ్యాలపై ఆలోచన చేస్తే వెన్ను విరుస్తామని. మళ్లీ అదే చెబుతున్నా.. తెలంగాణ సరిహద్దుల్లోకి మత్తు ముఠాలు రావాలంటే వణికే పరిస్థితి ఉండాలి. స్కూళ్లు, కాలేజీల్లో డ్రగ్స్ మూలాలు గుర్తిస్తే యాజమాన్యాలపైనా కేసులు పెడతాం. తెలంగాణలో ఎక్కడ డ్రగ్స్ మూలాలు ఉన్నా కనిపెట్టేలా 'ఈగల్' రంగంలోకి దిగుతుంది..' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

తరువాయి 2లో

# మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంపు



ఈ కబురు,హైదరాబాద్: మెదక్ భాజపా ఎంపీ రఘునందన్‌రావుకు భద్రత పెంచాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇటీవలే రఘునందన్‌రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ వచ్చిన విషయం తెలిసిందే.

తరువాయి 2లో

# సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్ పై హైకోర్టులో విచారణ



» 2లో

# ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఏం చేస్తున్నట్లు: కేటీఆర్



» 2లో

# జైహింద్.. జై భారత్".. అంతరిక్షం నుంచి శుభాంశు తొలి సందేశం!



ఈ కబురు: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమిని చూసే అవకాశం లభించిన కొద్దిమందిలో తాను ఉండటాన్ని అదృష్టంగా భావిస్తున్నాని శుభాంశు శుక్లా పేర్కొన్నారు. ఐఎస్ఎస్‌లోకి తొలిసారి ప్రవేశించిన ఆయన.. అక్కడున్న వ్యోమగాములతో కలిసి మాట్లాడారు. అంతకుముందు భూమి నుంచి 28గంటల ప్రయాణం తర్వాత ఐఎస్ఎస్ చేరుకున్న శుభాంశు.. అంతరిక్షంలోకి వెళ్లిన 634వ వ్యోమగామి కావడం విశేషం.

"ప్రియమైన నా తోటి భారతీయులకు ఓ చిన్న సందేశం. నేను 634వ వ్యోమగామిని. ఇక్కడకు రావడం గర్వంగా ఉంది. మీ ప్రేమ, ఆశీస్సుల వల్లే ఐఎస్ఎస్‌కు చేరుకున్నా. ఇక్కడ నిలబడటం చూడటానికి తేలికగా ఉన్నా.. నా తల కొంచెం భారంగా మారింది. కాస్త ఇబ్బందిగా అనిపిస్తోంది. ఇవి చిన్న విషయాలు. కొన్ని రోజుల్లో ఇవన్నీ అలవాటు అయిపోతాయి. ఈ ప్రయాణంలో ఇదే తొలిమెట్టు. రానున్న రోజుల్లో శాస్త్రీయ పరిశోధనలు చేపడతాం. మీతో మాట్లాడుతూనే ఉంటా. ఈ ప్రయాణం చాలా బాగుంది. ఇవి ఉత్తేజభరితమైన క్షణాలు. నా భుజంపై భారత పతాకాన్ని గర్వంతో ధరించా. నా ప్రయాణంపై మీరు కూడా ఉత్సాహంగా ఉన్నారని భావిస్తున్నా" అని శుభాంశు పేర్కొన్నారు.

తరువాయి 2లో

# 29న అమిత్ షా చేతుల మీదుగా పసుపు బోర్డు గ్రాండ్ ఓపెనింగ్ : కిషన్ రెడ్డి



ఈ కబురు: కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా 29న పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇవాళ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాల పసుపు రైతుల ఆకాంక్ష బోర్డుతో నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. అనేక రాజకీయ పార్టీలు హామీ ఇచ్చినా అర్వింద్ కృషి వల్ల ప్రధాని మోడీ ఆశీస్సులు ఆదేశాలతో పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్త కార్యక్రమాలకు కేంద్రంగా నిజామాబాదు లోనే బోర్డు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఇతర రాష్ట్రాలు కోరినా మోడీ నిజామాబాదులోనే ఏర్పాటు చేయడం ఇక్కడి రైతులకు అందించిన బహుమతి అని పేర్కొన్నారు. » 2లో

# రైలు పట్టాలపై.. కారుతో యువతి హల్‌చల్



తరువాయి 3లో

# లక్షలాది మంది శరణార్థుల దరఖాస్తుల తిరస్కరణకు అమెరికా సిద్ధం..!

» 3లో



# ఇరాన్‌దే గెలుపు.. అమెరికాను చెంపదెబ్బ కొట్టాం: ఖమేనీ తొలి స్పందన ఇదే!

» 3లో



# కొత్త కూటమి ఏర్పాటు చేస్తున్నాయా?



»3లో

మొదటి పేజీ తరువాయి

# ఈగల్ ఉంది జాగ్రత్త: సీఎం రేవంత్




'ఉద్యమ స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సిన తెలంగాణ రాష్ట్ర యువత డ్రగ్స్ మహమ్మారికి బలవడం న్యాయమా? ఉద్యమాల గడ్డ తెలంగాణ. ఇక్కడ పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు డ్రగ్స్ మహమ్మారికి బలవుతుంటే చూస్తూ కూర్చుందామా?..' అంటూ ప్రశ్నించారు. అంతా కలిస్తేనే ఆదర్శవంతమైన, ఆరోగ్యవంతమైన తెలంగాణ సాధ్యమవుతుందని చెప్పారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని గురువారం తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అతిథులుగా పాల్గొన్న సినీ హీరోలు రామ్‌చరణ్, విజయ్ దేవరకొండ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. అనంతరం రేవంత్‌రెడ్డి మాట్లాడారు.

పంజాబ్, హరియాణా పరిస్థితి రావొద్దు

'ఒకప్పుడు ఉద్యమాల గడ్డ అయిన తెలంగాణను గంజాయి, డ్రగ్స్ గడ్డగా మార్చొద్దు. ఒకప్పుడు దేశ స్వాతంత్ర్య పోరాటంలో, దేశ రక్షణలో ముందున్న పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లోని యువత ఇప్పుడు డ్రగ్స్ మహమ్మారితో నిర్వీర్యమైపోతోంది. అలాంటి పరిస్థితులు తెలంగాణలో రాకుండా ఉండాలనే సదుద్దేశంతోనే తెలంగాణలో గంజా యి, ఇతర మత్తుపదార్థాల రవాణా, వాడకంపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఒక దేశాన్ని దెబ్బ తీసేందుకు శత్రు దేశాలు డ్రగ్స్‌ను సైతం ఆయుధంగా మార్చుకునే పరిస్థితులు నేడు ఉన్నాయి..' అని ముఖ్యమంత్రి చెప్పారు.

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో.. ఇకపై 'ఈగల్'

'యాంటీ నార్కోటిక్స్ బ్యూరో (ఏఎన్‌బీ)ను ఇకపై 'ఈగల్' గా మారుస్తున్నాం..ఈగల్ అంటే ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్. తెలంగాణలోని కోటి 50 లక్షల ఎకరాల వ్యవసాయ భూమిలో ఎక్కడ గంజాయి పండించినా..ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ సప్లయ్ చేసినా ఈగల్ గుర్తిస్తుంది. స్కూళ్లు, కాలేజీల పరిసరాల్లో డ్రగ్స్ పట్టుబడితే యా జమాన్యాల పైనా కేసులు పెట్టాలని డీజీపీని ఆదేశిస్తున్నా.

కాలేజీలు చైల్డ్ సైకాలజిస్టులను ఏర్పాటు చేసుకోవాలి

విద్యార్థుల ప్రవర్తనను గమనించాల్సిన బాధ్యత యాజమాన్యాలపైనా ఉంది. కొందరు తల్లిదండ్రులు తమకున్న పరిస్థితుల కారణంగా వారి పిల్లలపై దృష్టి పెట్టలేకపోవచ్చు. కానీ అత్యంత ఎక్కువ సమయం స్కూళ్లు, కాలేజీల్లోనే గడుపుతారు కాబట్టి విద్యార్థుల ప్రవర్తనను గమనించేందుకు యాజమాన్యాలు చైల్డ్ సైకాలజిస్టులను ఏర్పాటు చేసుకోవాలి. చాక్లెట్లు కాదు గంజాయి చాక్లెట్లు అమ్మే పరిస్థితి ఉంది. కాబట్టి డ్రగ్స్ జాడ గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విద్యార్థులు కూడా ఒకవేళ చదువుల్లో రాణించకపోతే క్రీడల్లో రాణించండి. నేను ఉద్యోగాలు ఇస్తాను. లేదంటే రాజకీయంగా ఎదగాలి. మన యువత న్యూయార్క్, టోక్యో, సౌత్ కొరియా యువతతో పోటీపడే స్థాయికి ఎదగాలి..' అని సీఎం ఆకాంక్షించారు.

సినీ హీరోల విజయ గాథలు స్ఫూర్తిగా తీసుకోవాలి

'ఎవరికీ ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ అవసరం లేదు. కష్టపడితేనే జీవితంలో విజయాలు సాధ్యమవుతాయి. మాకెవరికీ బ్యాంక్‌గ్రౌండ్ లేదు. చిరంజీవికి ఎలాంటి సినీ బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా కఠోర శ్రమతో ఆయన మెగాస్టార్‌గా ఎదిగారు. రామ్‌చరణ్ కూడా ఎంతో శ్రమతో ఈ స్థాయికి ఎదిగారు. ఆర్ఆర్ఆర్ సినిమాతో ఆస్కార్ సాధించారు. నేను కూడా 2006లో జెడ్పీటీసీగా మొదలు పెట్టి 2023 నాటికి రాష్ట్ర ముఖ్యమంత్రిని అయ్యాను. విజయ్ దేవరకొండ కూడా నాలాగే నల్లమల నుంచి వచ్చారు. మా పక్క ఊరే. సినీ ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకపోయినా హీరోగా ఎదిగారు. అయితే సినిమాల్లోని పాత్రలను కాకుండా సినీ హీరోల నిజ జీవితంలోని విజయాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలి..' అని రేవంత్‌రెడ్డి కోరారు. ఎఫ్‌డీసీ చైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు మాట్లాడుతూ.. డ్రగ్స్ తీసుకునే వారిని బహిష్కరించాలని మలయాళ సినీ పరిశ్రమలో నిర్ణయం తీసుకున్నారని, తెలుగు చిత్రపరిశ్రమలో కూడా అలాంటి చర్యలు తీసుకోవడంపై చర్చిస్తామన్నారు. తెలంగాణను మత్తు రహితంగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీజీపీ జితేందర్ కోరారు. ఏఎన్‌బీ డైరెక్టర్ సందీప్ శాండిల్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆకాంక్ష మేరకు నషా ముక్త్ (మత్తు రహిత) తెలంగాణ ధ్యేయంగా తమ విభాగం పనిచేస్తోందన్నారు. కాగా డ్రగ్స్, గంజాయి జోలికి వెళ్లొద్దని..డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేద్దామనే నినాదంతో రూపొందించిన లఘు చిత్రాన్ని, వీడియో గీతాన్ని సీఎం విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా, వికలాంగుల శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు.'డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేద్దాం' వీడియో గీతాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, విజయ్ దేవరకొండ, రాంచరణ్, అడ్లూరి లక్ష్మణ్, గోపీచంద్, జితేందర్

ఒక తండ్రిగా నాకు ఆందోళన కలుగుతోంది..

స్కూళ్ల వద్ద ఐస్‌క్రీమ్‌లు, చాక్లెట్లలో ఏమిస్తున్నారో తెలియట్లేదు. పిల్లలను బయటకు పంపించాలంటే భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఒక తండ్రిగా ఇప్పుడు నాకు కూడా ఆందోళనగా ఉంది. యువత డ్రగ్స్ వైపు మళ్లకుండా కాపాడేందుకు తెలంగాణ ప్రభుత్వం, పోలీస్ శాఖ చేస్తున్న కృషి అభినందనీయం. డ్రగ్స్ మహమ్మారిని తరిమేయడంలో తెలంగాణ ప్రభుత్వానికి మేం కూడా పూర్తిగా సహకరిస్తాం. డ్రగ్స్ బారిన పడకుండా కాపాడడం మన కుటుంబం నుంచే మొదలు పెడదాం. ప్రతి ఒక్కరం ఒక సైనికుడిలా పోరాడాలి. అప్పుడే డ్రగ్స్‌లేని సమాజం సాధ్యం.

- రామ్‌చరణ్

ఆరోగ్యం లేకపోతే అన్నీ వృథాయే..

సినిమాలు, షూటింగ్‌లు, ఇల్లు మినహా బయట ఏం జరుగుతుందో నాకు పెద్దగా తెలియదు. కానీ ఈ మధ్య కొందరు పోలీసు అధికారులు ఈ డ్రగ్స్ విస్తరణను నాకు వివరించారు. ఆ తర్వాతే ఇది ఎంత ముఖ్యమైన అంశమో నాకు అర్థమైంది. అందుకే డ్రగ్స్‌తో వచ్చే ముప్పును చెప్పడానికి వచ్చా. డబ్బులు లేని లైఫ్‌ను.. ఉన్న లైఫ్ నేను చూశా. సక్సెస్, మనీ ఉన్నా..ఆరోగ్యం బాగా లేకపోతే అది వృథా. కాబట్టి డ్రగ్స్‌కు దూరంగా ఉండండి. మీరు అనుకున్న లక్ష్యాలు సాధించండి..డబ్బులు సంపాదించండి. తల్లిదండ్రులను సంతోషంగా చూసుకోండి. అదే మీకు ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.

మొదటి పేజీ తరువాయి

# డేంజర్‌లో జూరాల

## ప్రాజెక్ట్.. తెగిన రోప్‌వే..



ఈ కబురు, మహబూబ్‌నగర్/గద్వాల: కృష్ణా బేసిన్‌లో ఉమ్మడి రాష్ట్రంలోనే మొట్ట మొదటిదైన ఇందిరా ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అత్యంత వెనుకబడిన ప్రాంతమైన పాలమూరు జిల్లా వరప్రదాయినిగా నిలుస్తూ ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏడు లక్షలకు పైగా ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న ఈ ప్రాజెక్టుకు ఏళ్ల తరబడి మర మ్మతులు కరువయ్యాయి. సుమారు ఏడాది కాలంగా గేట్ల నుంచి నీళ్లు లీకవుతుండగా, తాజాగా నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో జూరాల పరిస్థితిపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్..

దెబ్బతిన్న రోప్‌లు, రబ్బరు సీళ్లు..

జూరాల ప్రాజెక్ట్‌కు పై నుంచి వచ్చిన నీటిని గానీ, సాగు అవసరాలకు గానీ ఆపరేట్ (పైకెత్తడం) చేయడం ద్వారా దిగువకు నీరు విడుదల చేసేలా సులభతరమైన విధానంలో మొత్తం 62 గేట్లను అర్ధ చంద్రాకారంల్లో ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటిని పైకి, కిందికి ఆపరేట్ చేసేందుకు గేట్లకు ఇరువైపులా రెండు రబ్బర్ సీళ్లు (రాపిడికి గురికాకుండా రక్షణ ఇచ్చేది), అడుగుభాగాన ఒక రబ్బర్ సీల్‌తో పాటు గేటుకు ఇరువైపులా రెండు, కింది భాగాన రెండు ఇనుప రోపులు అమర్చారు. వీటి సాయంతోనే రేడియల్ క్రస్ట్ గేట్లను అవసరమైనప్పుడు పైకెత్తడం, దించడం జరుగుతుంది. అవసరమైనప్పుడు నీటిని విడుదల చేయడం.. లేనిపక్షంలో నిలిపివేయడంలో ఇవి కీలకం. అలాంటి ఎనిమిది గేట్ల ఇనుప రోప్‌లు, 18 గేట్ల రబ్బర్ సీళ్లు దెబ్బతినడంతో లీకేజీలు ఏర్పడ్డాయి.

40 ఏళ్ల తర్వాత తొలిసారిగా..

జూరాల ప్రాజెక్టు చరిత్రలో 40 ఏళ్ల తర్వాత తొలిసారిగా అన్ని గేట్ల్లకు సంబంధించి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసేందుకు సుమారు నాలుగేళ్ల క్రితం గత ప్రభుత్వం రూ.11 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో రబ్బర్ సీళ్లు, రోప్‌లు, శాండ్ బ్లాస్టింగ్, గేట్ల బలోపేత, బకెట్ నిర్మాణాల మరమ్మతులు, పెయింటింగ్ పనులు చేపట్టాలి. హైదరాబాద్‌కు చెందిన స్వప్న కన్‌స్ట్రక్షన్ కంపెనీ పనులు దక్కించుకుంది. ఏడాది కాలపరిమితిలో పూర్తిచేసేలా ఒప్పందం కుదిరింది. ఏడాది గడువు ముగిసింది. మరోసారి పొడిగించారు. అయినా.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో సగం శాతం పనులు కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. ప్రాజెక్టు పైభాగాన ఉన్న హాయిస్ట్ బ్రిడి□జ్ గేట్ల వద్ద వాక్‌వే బ్రిడ్జికి సంబంధించి శాండ్ బ్లాస్టింగ్ పనులు పూర్తికాగా.. మిగిలిన పనులు కొనసాగుతూనే ఉన్నాయి.

తాజాగా వరద వదలడంతో..

తాజాగా గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో 98 వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. ప్రాజెక్టు 12 గేట్లను ఎత్తి దిగువకు వదిలారు. అయితే గురువారం ప్రాజెక్టు నాలుగో గేట్ ఇనుప రోప్ తెగిపోయి కన్పించింది. దీంతో ఆ గేట్ ఎత్తలేని పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ప్రాజెక్టు మరమ్మతుల్లో జాప్యం, భద్రత తదితర అంశాలు ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. 2009 మాదిరి జూరాలకు భారీ వరద వస్తే దెబ్బతిన్న గేట్లు కొట్టుకుపోయే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

అధికారులది పాత పాటే..

జూరాల ప్రాజెక్టు మరమ్మతుల్లో జాప్యం, భద్రతపై నెలకొన్న అనుమానాల నేపథ్యంలో 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. తాజాగా నాలుగో గేట్ రోప్ తెగిన నేపథ్యంలో ప్రాజెక్టు అధికారులతో పాటు గద్వాల జిల్లా ఇరిగేషన్ అధికారులను సంప్రదించగా.. గతంలో చెప్పిన సమాధానాలే చెప్పారు. 'రాష్ట్ర వ్యాప్తంగా ప్రాజెక్టు మెకానికల్ పనులు చేసే ప్రైవేట్ ఏజెన్సీలు తక్కువగా ఉన్నాయి. ఈ కారణంగా నాలుగేళ్ల కిందట జూరాల మరమ్మతులకు నిధులు మంజూరు అయినప్పటికీ .. కాంట్రాక్టు ఏజెన్సీ పనులు పూర్తి చేయడంలో తీవ్ర జాప్యం ఏర్పడింది. ప్రాజెక్టుకు పది లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా ప్రమాదమేం లేదు..' అని చెప్పారు. అయితే మరమ్మతులు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పలేకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ముందస్తు వరదతో పనులకు ఆటంకం

జూరాల ప్రాజెక్టు గేట్లు, రోప్‌లకు సంబంధించి మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఈసారి అన్ని రకాల సమస్యలను అధిగమించి మెకానికల్ పనులను వేగవంతంగా చేపట్టాలనుకున్నాం. అయితే ముందస్తుగా వరద రావడం ఆటంకంగా మారింది. అయితే ప్రస్తుతం ప్రాజెక్టుకు వచ్చిన ముప్పు ఏమీ లేదు. రేడియల్ క్రస్ట్ గేట్లు కావడంతో ఎంత పెద్ద వరద వచ్చినా కొట్టుకుపోయే అవకాశం లేదు.

- రహీమొద్దీన్, సాగునీటి పారుదల శాఖ ఎస్ఈ, జోగుళాంబ గద్వాల

ఇదీ ప్రాజెక్టు స్వరూపం..

జూరాల ప్రాజెక్టును 1981లో రూ.550 కోట్లతో నిర్మించారు. దీని పొడవు కిలోమీటర్, ఎత్తు 27.80 మీటర్లు. మొత్తం రాతికట్టడమే. ప్రాజెక్ట్‌కు ఆనుకుని ఎడమ వైపున 1.74 కి.మీలు, కుడివైపున 1.84 కి.మీల మేర ఎర్త్‌డ్యాం నిర్మించారు. మొత్తం 62 రేడియల్ క్రస్ట్ గేట్లు, 84 బ్లాకులతో నిర్మాణం చేశారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా.. దీని కింద 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది.

మొదటి పేజీ తరువాయి

# మెదక్ ఎంపీ రఘు నందన్‌రావుకు భద్రత పెంపు



ఈ కబురు,హైదరాబాద్: మెదక్ భాజపా ఎంపీ రఘు నందన్‌రావుకు భద్రత పెంచాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఇటీవలే రఘునందన్‌రావుకు మావోయిస్టుల నుంచి బెదిరింపు కాల్ వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ చేపట్టిన పోలీసు శాఖ మెదక్ ఎంపీకి భద్రత అవసరమని నిర్ధారణకు వచ్చింది. ఇకపై రఘు నందన్‌రావు పర్యటనలో ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈమేరకు మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ముగ్గురు ఎస్పీలకు ఆదేశాలు జారీ అయ్యాయి.రఘునందన్‌రావుకు పీపుల్స్‌వార్ మావోయిస్టు పేరుతో బెదిరింపు కాల్ వచ్చింది. సోమవారం సాయంత్రంలోగా చంపుతామంటూ ఆగంతకుడు ఫోన్ చేశాడు. తాను మధ్యప్రదేశ్‌కు చెందిన మావోయిస్టునంటూ బెదిరించాడు. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడలో ఓ ప్రైవేటు పాఠశాల కార్యక్రమానికి ఎంపీ హాజరైన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ ఫోన్‌కాల్‌ను రఘునందన్ పీఏ లిఫ్ట్ చేశారు. బెదిరింపు కాల్‌పై డీజీపీ, మెదక్ జిల్లా ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులకు రఘునందన్

మొదటి పేజీ తరువాయి

# 29న అమిత్ షా చేతుల మీదుగా పసుపు బోర్డు గ్రాండ్ ఓపెనింగ్ : కిషన్ రెడ్డి



ఈ కబురు: కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేతుల మీదుగా 29న పసుపు బోర్డు కార్యాలయం ప్రారంభం ఘనంగా నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఇవాళ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక సంవత్సరాల పసుపు రైతుల ఆకాంక్ష బోర్డుతో నెరవేరిందని హర్షం వ్యక్తం చేశారు. అనేక రాజకీయ పార్టీలు హామీ ఇచ్చినా అర్వింద్ కృషి వల్ల ప్రధాని మోడీ ఆశీస్సులు ఆదేశాలతో పసుపు బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశవ్యాప్త కార్యక్రమాలకు కేంద్రంగా నిజామాబాదు లోనే బోర్డు ఏర్పాటు చేయడం గొప్ప విషయమని కొనియాడారు. ఇతర రాష్ట్రాలు కోరినా మోడీ నిజామాబాదులోనే ఏర్పాటు చేయడం ఇక్కడి రైతులకు అందించిన బహుమతి అని పేర్కొన్నారు. జిల్లాకు చెందిన రైతు బిడ్డ అయిన గంగారెడ్డిని చైర్మన్ చేయడం మరో విశేషం అని చెప్పారు. 29న రైతులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున రావాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో పసుపు ఉత్పత్తి పెరిగే విధంగా.. ఉపాధి పెరిగే విధంగా.. రైతులకు ప్రయోజనం కలిగే విధంగా బోర్డు కార్యాచరణతో ముందుకు సాగుతుందన్నారు. మాజీ మంత్రి డీఎస్ విగ్రహాన్ని కూడా అమిత్ షా నిజామాబాదులో 29న ఆవిష్కరిస్తారని స్పష్టం చేశారు.

సీఎం రేవంత్ పీసీసీ చీఫ్‌గా ఉన్నప్పుడు పదే పదే ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ జరపాలని డిమాండ్ చేశారని గుర్తుకు చేశారు. తెలంగాణ పోలీసులపైనే స్థానిక పోలీసులు దర్యాప్తు చేస్తే న్యాయం జరగదని కాంగ్రెస్‌లో ఉన్న వారు కూడా అంటున్నందున బీఆర్ఎస్‌తో కుమ్మక్కు కాలేదని నిరూపించుకోవాలంటే.. రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే సీబీఐకి ఫోన్ ట్యాపింగ్ కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు. హై కోర్టు న్యాయవాదుల ఫోన్లు కూడా ట్యాపయ్యాయని ఆరోపించారు. మొదటి నుంచి ట్యాపింగ్ కేసును సీబీఐ కి కాంగ్రెస్ ఇస్తుందా? ఇవ్వదా? అనే అనుమానంతో బీజేపీ హైకోర్టుకు వెళ్ళిందన్నారు. ట్యాపింగ్ కేసు సాధారణమైనది కాదని, తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు సీబీఐకి కేసును అప్పగించాలని డిమాండ్ చేశారు.

మొదటి పేజీ తరువాయి

# జైహింద్.. జై భారత్''.. అంతరిక్షం నుంచి శుభాంశు తొలి సందేశం!




ఈ కబురు: అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూమిని చూసే అవకాశం లభించిన కొద్దిమందిలో తాను ఉండటాన్ని అదృష్టంగా భావిస్తున్నాని శుభాంశు శుక్లా పేర్కొన్నారు. ఐఎస్ఎస్‌లోకి తొలిసారి ప్రవేశించిన ఆయన.. అక్కడున్న వ్యోమగాములతో కలిసి మాట్లాడారు. అంతకుముందు భూమి నుంచి 28గంటల ప్రయాణం తర్వాత ఐఎస్ఎస్ చేరుకున్న శుభాంశు..అంతరిక్షంలోకి వెళ్లిన 634వ వ్యోమగామి కావడం విశేషం.

''ప్రియమైన నా తోటి భారతీయులకు ఓ చిన్న సందేశం. నేను 634వ వ్యోమగామిని. ఇక్కడకు రావడం గర్వంగా ఉంది. మీ ప్రేమ, ఆశీస్సుల వల్లే ఐఎస్ఎస్‌కు చేరుకున్నా. ఇక్కడ నిలబడటం చూడటానికి తేలికగా ఉన్నా.. నా తల కొంచెం భారంగా మారింది. కాస్త ఇబ్బందిగా అనిపిస్తోంది. ఇవి చిన్న విషయాలు. కొన్ని రోజుల్లో ఇవన్నీ అలవాటు అయిపోతాయి. ఈ ప్రయాణంలో ఇదే తొలిమెట్టు. రానున్న రోజుల్లో శాస్త్రీయ పరిశోధనలు చేపడతాం. మీతో మాట్లాడుతూనే ఉంటా. ఈ ప్రయాణం చాలా బాగుంది. ఇవి ఉత్తేజభరితమైన క్షణాలు. నా భుజంపై భారత పతాకాన్ని గర్వంతో ధరించా. నా ప్రయాణంపై మీరు కూడా ఉత్సాహంగా ఉన్నారని భావిస్తున్నా'' అని శుభాంశు పేర్కొన్నారు.

ఇక సహచర వ్యోమగాముల గురించి మాట్లాడుతూ.. ''అంతరిక్షంలోకి రావాలని ఎంతో కాలంగా చూస్తున్నా. ఇక్కడున్న వ్యోమగాములు మాకు తలుపులు తెరచి స్వాగతం పలుకుతుంటే ఇంట్లోకి స్వాగతం చెప్పినట్లు అనిపించింది. ఇది నిజంగా అద్భుతం. ఇదో కొత్త అనుభూతి. ఇక్కడకు వచ్చే ముందు నాకున్న అంచనాలన్నీ తొలగిపోయాయి. శాస్త్ర పరిశోధనల్లో భాగంగా తదుపరి 14 రోజులు మీతో కలిసి పనిచేస్తాననే పూర్తి విశ్వాసం ఉంది'' అని చెప్పారు.

ఇదిలాఉంటే, యాక్సియం4 మిషన్‌లో భాగంగా ఫాల్కన్9 రాకెట్‌ద్వారా భారత్‌కు చెందిన శుభాంశు శుక్లా సహా పెగ్గీ విట్సన్ (అమెరికా), స్లావోస్జ్ ఉజ్నాన్‌స్కీ విస్నీవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ)లు అంతరిక్షంలోకి వెళ్లారు. భారత కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 12.01 గంటలకు అమెరికాలోని కెన్నడీ అంతరిక్ష కేంద్రం నుంచి బయలుదేరిన వీరి స్పేస్‌క్రాఫ్ట్ గురువారం సాయంత్రం ఐఎస్ఎస్‌కు చేరుకుంది. సాయంత్రం 4.03గంటలకు డాకింగ్ ప్రక్రియ పూర్తయ్యింది. అనంతరం కొద్దిసేపటికే వీరంతా ఐఎస్ఎస్‌లోకి ప్రవేశించారు. ఈ మిషన్‌లో భాగంగా వీరంతా 14 రోజులపాటు అక్కడే గడపనున్నారు.

# ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎంపీలు ఏం చేస్తున్నట్లు: కేటీఆర్



ఈ కబురు,హైదరాబాద్: మెట్రో విస్తరణకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంపై భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శలు గుప్పించారు. ఇద్దరు కేంద్ర మంత్రులు, 8 మంది భాజపా ఎంపీలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. వారంతా ఎవరికోసం పని చేస్తున్నారని విమర్శించారు. ''గుజరాత్‌కు రూ.2లక్షల కోట్ల విలువైన బుల్లెట్ ట్రైన్ ఇచ్చుకున్నారు. హైదరాబాద్‌కు కనీసం మెట్రోరైలు ప్రాజెక్టు కూడా ఇవ్వరా?''

# ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు

ఈ కబురు,హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు చేస్తోంది. హైదరాబాద్ నగరంతో పాటు పెద్దపల్లి తదితర ప్రాంతాల్లో అధికారులు తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఉప్పల్, తిరుమలగిరి, మన్నెగూడలో సోదాలు కొసాగుతున్నాయి. హైదరాబాద్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్, రంగారెడ్డి జిల్లా డీఎస్పీ ఆనంద్ ఆధ్వర్యంలో అధికారులు పలు పత్రాలను పరిశీలిస్తున్నారు. తిరుమలగిరిలో ఇద్దరు క్లర్క్‌లతో పాటు 10 మంది ఏజెంట్లను పట్టుకున్నారు. కార్యాలయం తలుపులు మూసివేసి తనిఖీలు చేస్తున్నారు. ఉప్పల్‌లో 10 మంది ఏజెంట్లను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

# 'మహాలక్ష్మి పథకానికి పోస్టు ఆఫీసు అకౌంట్' పుకార్లు


పోస్టు ఆఫీసుల వద్ద బారులు తీరిన మహిళలు


పోస్టు ఆఫీసుల వద్ద బారులు తీరిన మహిళలు

శేరిలింగంపల్లిలో పోస్టు ఆఫీసులకు క్యూ

## కట్టిన మహిళలు

ఈకబురు, శేరిలింగంపల్లి : నేటి కాలంలో సోషల్ మీడియాలో నకిలీ వార్తలను వ్యాప్తి చేయడం సర్వసాధారణమైన విషయంగా మారింది. అనేక సంఘటనలు, ప్రభుత్వ పథకాల గురించి ప్రతిరోజూ పుకార్లు వ్యాపిస్తున్నాయి. ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్న సామాన్య ప్రజలు ఈ పుకార్లు నమ్మి మోసపోతున్నారు. ముఖ్యంగా మహిళలు ప్రభుత్వ పథకాలపై తప్పుడు ప్రచారాలు నమ్మి ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా శేరిలింగంపల్లిలో ఇటువంటి సంఘటనే చోటుచేసుకుంది. పోస్ట్ ఆఫీసులో అకౌంట్ ఓపెన్ చేస్తేనే మహాలక్ష్మి పథకం అర్హులంటూ ప్రచారం వ్యాపించడంతో ఈ పథకం కోసం ఎదురుచూస్తున్న మహిళలు పోస్ట్ ఆఫీసులకు క్యూ కట్టారు. తెలంగాణ రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీల అమలు హామీని ఇచ్చింది. ఇందులో భాగంగా మహాలక్ష్మి పథకం మొదటి ఫేస్ లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రస్తుతం అమలు చేస్తుంది. కాగా స్థానిక ఎన్నికల నేపథ్యంలో మహాలక్ష్మి పథకం రెండవ పేజ్ లో భాగంగా మహిళలకు నెలకు 2,500 ఆర్థిక సాయం అమలు చేసే అవకాశం ఉందని ప్రచారం నడుస్తుంది. ఈ విషయమై ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు అధికారికంగా ఎటువంటి ఉత్తర్వులు వెలువడకపోగా, ఈ పథకం కేంద్రంగా నకిలీ వార్తలు జోరుగా ప్రచారం అవుతున్నాయి. తాజాగా హైటెక్ నియోజకవర్గం శేరిలింగంపల్లి లో ఓ నకిలీ ప్రచారాన్ని నమ్మి మహిళలు ఉరుకులు పరుగులు పెట్టారు. పోస్ట్ ఆఫీసులో అకౌంటు ఉన్న వారికే మహాలక్ష్మి పథకం నెలనెలా ఆర్థిక సహాయం అందిస్తారంటూ పుకార్లు వ్యాపించాయి. దీంతో శేరిలింగంపల్లి పరిధిలోని మహిళలు పోస్ట్ ఆఫీస్ లకు క్యూ కట్టారు. మండల పరిధిలోని పోస్ట్ ఆఫీసులు ఒక్కసారిగా మహిళలతో కిటకిటలాడాయి. మహాలక్ష్మి పథకం కోసం ఎదురుచూస్తున్న మహిళలు పోస్ట్ ఆఫీసులో ఖాతాలు తెరిచేందుకు బారులు తీరారు.

**తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు : చంద్రికా ప్రసాద్**

తప్పుడు ప్రచారాలు నమ్మి మహిళలు ఇబ్బందులు పడవద్దని శేరిలింగంపల్లి నియోజక వర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ గౌడ్ సూచించారు. పోస్ట్ ఆఫీసులో అకౌంట్ ఓపెన్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం ఆర్థిక సహాయం వేస్తారని ప్రచారం నిజం కాదని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతిఒక్క లబ్ధిదారులకు పూర్తి న్యాయం చేస్తుందని, మహిళలు తప్పుడు ప్రచారాలు నమ్మి ఇబ్బందులు పడద్దని సూచించారు.



# లక్షలాది మంది శరణార్థుల దరఖాస్తుల తిరస్కరణకు అమెరికా సిద్ధం..!

ఈ కబురు: వలసదారులపై మరింత కఠిన చర్యలకు ట్రంప్ కార్యవర్గం సిద్ధమవుతోంది. దీనిలో భాగంగా లక్షలాది శరణార్థి దరఖాస్తులను తిరస్కరించి వారిని వేగంగా దేశం నుంచి బయటకు పంపేందుకు ఏర్పాట్లు చేస్తోంది. అమెరికాలో వచ్చి రక్షణ పొందే వలసదారులను అడ్డుకొనేందుకు ఈ చర్యలు తీసుకొంటున్నట్లు సీఎన్ఎన్ కథనంలో వెల్లడించింది. ఇప్పటికే వలసదారులను పెద్ద సంఖ్యలో అరెస్టు చేయాలన్న లక్ష్యాలను చేరుకోలేక అమెరికా ఫెడరల్ అధికారులు ఒత్తిడిలో ఉన్నారు. దీంతో మరింత మందిని డిపోర్టేషన్ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. దేశంలోకి అక్రమంగా ప్రవేశించి ఆశ్రయం కోసం దరఖాస్తు చేసుకొన్న వారిని ఈ కొత్త నిబంధనల్లో లక్ష్యంగా చేసుకొనే అవకాశాలున్నాయి. వారి కేసులను త్వరగా మూసివేసి.. బహిష్కరణ పరిధిలోకి తీసుకురావలన్నది ప్రణాళికగా సీఎన్ఎన్ పేర్కొంది. దీంతో లక్షల మంది శరణార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ఇరాన్ అణుకేంద్రాలు ధ్వంసం కాలేదా!

గత పదేళ్లలో అమెరికా సిటిజన్ షిప్ అండ్ ఇమిగ్రెంట్ సర్వీసెస్, యూఎస్‌సీఐఎస్‌ను ఆశ్రయం కోరిన వారిలో కనీసం 25 శాతం అక్రమంగా దేశంలో ప్రవేశించారు. ఈ విషయాన్ని 2023 ఫెడరల్ రిపోర్టు వెల్లడించింది. స్వదేశాల్లో అణచివేత, హింసకు గురైన వారు అమెరికా చట్ట ప్రకారం ఆశ్రయం కోరవచ్చు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అమెరికా దక్షిణ సరిహద్దుల నుంచి వచ్చి ఆశ్రయం కోరేవారిని పూర్తిగా అడ్డుకొన్నారు. ప్రస్తుతం అమెరికా ఏజెన్సీల వద్ద 14.5 లక్షల శరణార్థుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

# ఇరాన్‌దే గెలుపు.. అమెరికాను చెంపదెబ్బ కొట్టాం: ఖమేనీ తొలి స్పందన ఇదే!

ఈ కబురు,దుబాయి: ఇజ్రాయెల్ ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తొలిసారి స్పందించారు. 12 రోజుల పాటు కొనసాగిన ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌పై తమ దేశమే విజయం సాధించిందని ఆయన ప్రకటించారు. అలాగే, అమెరికా స్థావరాలపై దాడి చేయడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. జూన్ 19 తర్వాత తొలిసారిగా ఇరానియన్ స్టేట్ టెలివిజన్‌లో ఖమేనీ వ్యాఖ్యల వీడియో ప్రసారమైంది. అమెరికా జోక్యం చేసుకోకపోతే ఇజ్రాయెల్ నాశనమవుతుందని అగ్రరాజ్యం భావించడం వల్లే ఈ యుద్ధంలో జోక్యం చేసుకుందన్నారు. అయితే, ఈ యుద్ధం వల్ల అమెరికా ఎటువంటి ప్రయోజనం సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. 'రైజింగ్ లయన్' నుంచి 'మిడ్‌నైట్ హ్యామర్' వరకు.. ఇజ్రాయెల్ఇరాన్ యుద్ధం సాగిందిలా!

''ఇస్లామిక్ రిపబ్లిక్ విజయం సాధించింది. అమెరికాను చెంపదెబ్బ కొట్టింది. సోమవారం ఖతార్‌లో అమెరికా కీలక స్థావరాల్లో ఒకటైన అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది. ఇందులో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను యాక్సెస్ చేయగలదు. అవసరమనుకుంటే దాడులూ చేయగలదు. భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు పునరావృతం కావొచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే.. శత్రువు కచ్చితంగా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది'' అని ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా అలీ ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారంటూ వస్తోన్న వార్తల నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు.



# చైనా, పాక్, బంగ్లా.. కొత్త కూటమి ఏర్పాటు చేస్తున్నాయా?



ఈ కబురు: చైనా, పాకిస్థాన్‌లతో సంబంధాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్న బంగ్లాదేశ్ ప్రతినిధులు ఇటీవల ఆ దేశాల్లో పర్యటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ మూడు దేశాలు కలిసి కొత్త కూటమిగా ఏర్పడనున్నాయనే కథనాలు వెలువడ్డాయి. తాజాగా వీటిని బంగ్లాదేశ్ తోసిపుచ్చింది. ఇటీవల జరిగిన త్రైపాక్షిక భేటీ రాజకీయపరమైంది కాదని.. ఎటువంటి కూటమి ఏర్పాటు చేయడం లేదని పేర్కొంది. చైనాలో ఇటీవల రెండు ప్రాంతీయ సదస్సులు జరిగాయి. ఇదే సమయంలో కున్మింగ్‌లో జూన్ 19న చైనా, పాక్, బంగ్లా దేశాల ప్రతినిధులు త్రైపాక్షిక సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఈ మూడు దేశాలు కొత్త కూటమి ఏర్పాటు చేయనున్నాయనే ఊహాగానాలు వెలువడ్డాయి. దీనిపై బంగ్లాదేశ్ విదేశీ వ్యవహారాల సలహాదారు ఎం. తౌహిద్ హుస్సేన్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారుల స్థాయిలోనే సమావేశం జరిగిందని, రాజకీయ స్థాయిలో కాదన్నారు. భారత్‌ను పక్కనపెట్టే ఉద్దేశంతోనే ఆ సమావేశం జరిగిందా? అన్న ప్రశ్నకు బదులిస్తూ.. మూడవపక్షాన్ని లక్ష్యంగా చేసుకున్నది మాత్రం కాదన్నారు.

దీనిపై చైనా, పాక్‌లు ఇప్పటికే వేర్వేరు ప్రకటనలు చేశాయి. త్రైపాక్షిక సహకారంపైనే విస్తృత చర్చలు జరిపామని, పరస్పర విశ్వాసం, సమానత్వం, సమ్మిళిత అభివృద్ధి ఆధారంగా ముందుకు సాగాలని నిర్ణయించినట్లు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా 'జాయింట్ వర్కింగ్ గ్రూప్'గా ఏర్పడాలని అభిప్రాయానికి వచ్చినట్లు తెలిపాయి. అయితే, బంగ్లాదేశ్ ప్రకటన విడుదల చేసినప్పటికీ.. వర్కింగ్ గ్రూపు ఏర్పాటు నిర్ణయం ప్రస్తావనను మాత్రం తీసుకురాలేదు.

# రైలు పట్టాలపై.. కారుతో యువతి హల్‌చల్

ఈ కబురు: చేవెళ్ల గ్రామీణం, మానసిక స్థితి సరిగాలేని యువతి రైలు పట్టాలపై కారుతో వేగంగా దూసుకెళ్తూ హల్‌చల్ చేసిన ఉదంతం కలకలం సృష్టించింది. రైల్వే సిబ్బంది ఉన్నతాధికారులను అప్రమత్తంచేయడం, వారు ఆ మార్గంలో రైళ్ల రాకపోకలను నిలిపేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ కారణంగా దాదాపు రెండు గంటలపాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం ప్రకారం..ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లఖ్‌నవూకు చెందిన 34 ఏళ్ల వోమిక సోని హైదరాబాద్ నార్సింగి పరిధి గౌలిగూడలోని హోటల్‌లో నివాసం ఉంటోంది. గురువారం పెంపుడు కుక్కను నార్సింగి పోలీస్‌స్టేషన్ సమీపంలో వదిలేసిన ఆమె.. తన కారులో ఉదయం 6.50 గంటల ప్రాంతంలో రంగారెడ్డి జిల్లా పరిధి శంకర్‌పల్లి వైపు వచ్చింది. కొండకల్ సమీపంలో రైలు పట్టాలపైకి కారును ఎక్కించింది. అనంతరం వేగంగా వికారాబాద్ వైపు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం పట్టాలపైనే ప్రయాణించింది. అక్కడి రైల్వే సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో..వారు అప్రమత్తమయ్యారు. ఆ మార్గంలో రైళ్లు రాకుండా చర్యలు చేపట్టడంతో ప్రమాదం తప్పింది. శంకర్‌పల్లి శివారు వద్ద స్థానికులు పట్టాలపై దూసుకెళ్తున్న కారును ఆపే ప్రయత్నం చేశారు. ఈలోగా మలుపులో కారు ఆగిపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

**తల్లిదండ్రులు సహకరించడంలేదు.. ఆత్మహత్య చేసుకోవాలనుకున్నా**

ఆగిన తర్వాత కారులోంచి బయటకు వచ్చేందుకు యువతి నిరాకరించింది. ఎంతకీ కారు దిగకపోవడం, కారు పట్టాలపై నిలిచి ఉండటంతో సహనం కోల్పోయిన వారు..అద్దాలు పగలగొట్టి బలవంతంగా ఆమెను బయటకు తీశారు. ఈ క్రమంలో ఆమె పెనుగులాడిందని, తన వద్ద ఉన్న కత్తి చూపిస్తూ బెదిరింపులకు పాల్పడిందని స్థానికులు తెలిపారు. ఈలోపు అక్కడికి చేరుకున్న స్థానిక పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకుని శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 'యువతి డ్రగ్స్ వినియోగించిందా అనే అనుమానంతో రక్త నమూనాలు సేకరించాం. విచారణలో పొంతనలేని సమాధానాలు చెబుతుండటంతో చేవెళ్ల ప్రభుత్వాసుపత్రికి తరలించాం. వైద్య పరీక్షలకు ఆమె సహకరించలేదు. గ□ంట తర్వాత సాధారణ స్థితికి వచ్చింది. తల్లిదండ్రులు తనకు ఆర్థికంగా సహకరించటం లేదని, మానసికంగా కుంగిపోయానని, అందుకే రైలు పట్టాలపైకి వెళ్లి.. ఆత్మహత్యకు యత్నించానని తెలిపింది' అని పోలీసులు వెల్లడించారు.

**భర్తతో విడిపోయింది.. ఉద్యోగం పోయింది..**

కారులోని పత్రాల ఆధారంగా పోలీసులు యువతి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. 'వివాహం జరిగిన కొద్ది రోజులకే భర్తతో విడిపోయింది. హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుండేది. ఇటీవల సంస్థ ఉద్యోగం నుంచి తొలగించడంతో మాపై ఆధారపడుతోంది. కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేదు. అందుకే అలా ప్రవర్తిస్తోంది' అని యువతి తల్లిదండ్రులు తెలిపినట్టు పోలీసులు వెల్లడించారు. స్థానిక పోలీసుల సమాచారం మేరకు ఆర్‌పీఎఫ్ ఏసీపీ దల్వారా, సీఐలు రవిబాబు, శ్రీకాంత్ చేవెళ్ల ప్రభుత్వాసుపత్రిలో యువతిని విచారించారు. జీవితంపై విరక్తితో ఆమె ఆత్మహత్యకు యత్నించిందని, ఈ మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. అనంతరం యువతిని వైద్య పరీక్షల నిమిత్తం తొలుత ఉస్మానియా ఆసుపత్రికి, అక్కణ్నుంచి ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయానికి తరలించినట్టు చెప్పారు.



# చందానగర్ లో చైన్ స్నాచింగ్



### వృద్ధురాలి మెడలో 4 తులాల చైన్ చోరీ

ఈకబురు, శేరిలింగంపల్లి : ఉదయం లేచి ఇంటి ముందు చీపురుతో ఉడుస్తున్న వృద్ధురాలి మెడలో నుంచి ద్విచక్రవాహనం మీద వచ్చిన దుండగుడు 4 తులాల బంగారు గోలుసును లాక్కెళ్లారు. చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటన కు సంబంధించిన వివరాలు పోలీసులు తెలిపిన ప్రకారం... చందానగర్ పరిధిలోని ఓల్డ్ ఏంఐజీ కాలనీ ప్లాట్ నెంబర్ 730 లో నివాసం ఉండే శాంతి లక్ష్మీ (72) గురువారం ఉదయం ఇంటి ముందు ఊడ్చి, కల్లాపి పనులు చేస్తుంది. అదే సమయంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి స్కూటీ పై వచ్చి ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. గొలుసు లాగుతున్న సమయంలో వృద్ధురాలు కిందపడిపోయినప్పటికీ కనికరం లేకుండా, అలాగే కొద్దిదూరం ఈడ్చుకుంటూ వెళ్లాడు. క్షణాల్లో మెడలో ఉన్న గోలుసును తెంచుకుని అక్కడి నుంచి పారిపోయాడు. ఈ మేరకు బాధితురాలు చందానగర్ పోలీసులకు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

# గంజాయి అమ్ముతున్న యువకుల అరెస్ట్


పోలీసులు అరెస్టు చేసిన ఇద్దరు యువకులు

### 1.3 కేజీల గంజాయి స్వాధీనం

ఈకబురు, శేరిలింగంపల్లి : మహారాష్ట్రలో గంజాయి కొనుగోలు చేసి అధిక ధరలకు నగరంలో విక్రయిస్తున్న ఇద్దరు యువకులను చందానగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కి తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పాపిరెడ్డి కాలనీలో నివాసం ఉండే హరినాథ్(24), శివాజీ(25)లు మహారాష్ట్రలో తక్కువ ధరకు గంజాయి కొనుగోలు చేసి నగరంలో మత్తుకు బానిసైన వారిని టార్గెట్ చేసుకుని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నారు. గంజాయి విక్రయం పై పక్కా సమచారం అందుకున్న చందానగర్ పోలీసులు ఇద్దరు యువకులను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. వారి వద్ద నుండి 1.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకొని, ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

# మధురానగర్ లో 'నిషా ముక్త్ భారత్' అవగాహన ర్యాలీ


జూనియర్ కళాశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం


జూనియర్ కళాశాల ఆవరణలో కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**పాల్గొన్న జూనియర్ కళాశాల విద్యార్థులు**

ఈకబురు, శేరిలింగంపల్లి : రాయదుర్గం పరిధిలోని మధురానగర్ లో నిషా ముక్త్ భారత్ అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ రాయదుర్గం సెక్టార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో మధురానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ శేరిలింగంపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కవిత మాట్లాడుతూ యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. మద్యం మదకద్రవ్యాల మీద విద్యార్థులు అవగాహన పెంచుకొని వాటి బారిన పడకుండా పక్కవారిని జాగృతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఇందిర, డాక్టర్ సుధా, కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు. ఇంఛార్జి రాజశేఖర్, అంగన్వాడీ టీచర్లు శ్రీలత, స్వప్న, సునీత, నాగమణి, జ్యోతి, శివలత, శారద, రాధిక, శాంతాబాయి మౌనిక, నీరజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్ పై హైకోర్టులో విచారణ

ఈ కబురు : తనపై కింది కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలని సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గత లోక్ సభ ఎన్నికల ప్రచారంలో బీజేపీ పరువుకు భంగం కలిగేలా మాట్లాడారంటూ రేవంత్ రెడ్డిపై బీజేపీ నేత వాసం వెంకటేశ్వర్లు ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు వేశారు. అయితే ఈ కేసును కొట్టివేయాలని కోరుతూ రేవంత్ రెడ్డి హైకోర్టులో వేసిన పిటిషన్ పై నేడు విచారణ జరిగింది.

పీసీసీ అధ్యక్షుని హోదాలో చేసిన రాజకీయ ప్రసంగమే తప్ప, వేరే ఉద్దేశం లేదని, వెంటనే డిఫమేషన్ కేసును కొట్టివేయాలని రేవంత్ తరపున న్యాయవాది తన వాదనలు వినిపించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ కె.లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం.. తదుపరి విచారణను జులై 2కి వాయిదా వేసింది.





## సెకనుకు మూడు వాహనాలు డెలివరీ

మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ 2025 మే నెలలో 24.5 లక్షలకు పైగా వాహనాలను సర్వీస్ అందించడం ద్వారా అమ్మకాల అనంతరం చేసిన సర్వీస్‌లో రికార్డు నెలకొల్పింది. మే నెలలో దేశవ్యాప్తంగా మారుతీ సుజుకీ నిమిషానికి 170 వాహనాలను సర్వీస్ చేసి డెలివరీ చేసింది. అంటే సెకనుకు దాదాపు మూడు వాహనాలను డెలివరీ చేసినట్లయింది.

ఈ విజయం మారుతీ సుజుకీ విస్తృతమైన సర్వీస్ నెట్‌వర్క్ సామర్థ్యాన్ని హైలైట్ చేస్తుందని కంపెనీ తెలిపింది. మెట్రో నగరాలు, చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో 5,400కుపైగా సర్వీసు సెంటర్లున్నాయని సంస్థ పేర్కొంది. తాజా రికార్డులో భాగంగా పెయిడ్ సేవలు, ఉచిత సేవలు, రన్నింగ్ రిపేర్లు ఉన్నాయి.

ఈ సందర్భంగా మారుతీ సుజుకీ ఇండియా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ హిసాషి టకేచి మాట్లాడుతూ 'కంపెనీ చరిత్రలో ఒక నెలలో 24.5 లక్షలకు పైగా వాహనాలకు సర్వీస్ చేయడం ఇదే మొదటిసారి. ఇది సర్వీస్ నెట్‌వర్క్ స్థాయిని, సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తుంది. దేశవ్యాప్తంగా మా సేవా బృందాలు, డీలర్ భాగస్వాముల అవిశ్రాంత కృషి ఫలితమిది' అన్నారు.

# అంబానీ, అదానీ మళ్లీ జత కలిశారు

**ఇంధన విక్రయాల్లో పరస్పర సహకారం**

**ఆసియాలోనే అత్యంత సంపన్నులైన ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ.. ఇంధన రిటెయిల్ నెట్‌వర్క్‌లను పరస్పరం వినియోగించుకునేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ ప్రకారం ..**





అదానీ గ్రూప్, ఫ్రాన్స్‌కు చెందిన టోటల్ ఎనర్జీస్ సంయుక్త సంస్థ అదానీ టోటల్ గ్యాస్ లిమిటెడ్ (ఏటీజీఎల్)కు చెందిన సీఎన్‌జీ రిటెయిల్ అవుట్‌లెట్లలో.. బ్రిటన్‌కు చెందిన బీపీతో కలిసి అంబానీ నెలకొల్పిన సంయుక్త సంస్థ జియోబీపీ పెట్రోలు, డీజిల్ విక్రయాలను చేపడుతుంది.

జియోబీపీ ఇంధన బంకుల్లో ఏటీజీఎల్ తన సీఎన్‌జీ పంపిణీ యూనిట్లను ఏర్పాటు చేస్తుంది. ఈ భాగస్వామ్యం ప్రస్తుత అవుట్‌లెట్లతో పాటు భవిష్యత్తులో ఏర్పాటు చేయబోయే అవుట్‌లెట్లకూ వర్తిస్తుంది.

తొలి భాగస్వామ్యం ఇలా: అంబానీ, అదానీ చేతులు కలపడం ఇది రెండోసారి. గతేడాది మార్చిలో మధ్యప్రదేశ్‌లోని ఒక విద్యుత్ ప్రాజెక్టు విషయంలో తొలిసారిగా అదానీ, అంబానీ భాగస్వామ్యం కుదుర్చుకున్నారు. అదానీ పవర్‌కు చెందిన ఆ ప్రాజెక్టులో రిలయన్స్ ఇండస్ట్రీస్ 26% వాటా పొందింది. తద్వారా ప్లాంటుకు చెందిన 500 మెగావాట్ల (ఎండబ్ల్యూ) విద్యుత్‌ను సొంత అవసరాల కోసం వినియోగించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. వీరిద్దరి కంపెనీలు మెగా పునరుత్పాదక ఇంధన పార్కుల ఏర్పాటులో, మీడియా, టెలికాం వంటి రంగాల్లోనూ పోటీ పడుతుండడం విశేషం.

నా జీవితంలో తీసుకున్న అతిపెద్ద రిస్క్ అదే.. జియోపై ముకేశ్ అంబానీ: 2016లో రిలయన్స్ జియో ప్రారంభంతో టెలికాం సేవల్లోకి తిరిగి అడుగుపెట్టడమే తన జీవితంలో తీసుకున్న అతిపెద్ద రిస్క్ అని రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ పేర్కొన్నారు. మెకిన్సే అండ్ కోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ '4జీ మొబైల్ నెట్‌వర్క్‌పై బిలియన్లకొద్దీ డాలర్లను కుమ్మరించడం, ఆర్థికంగా వైఫల్యానికి దారితీస్తుందని విశ్లేషకులు చెప్పారు. అత్యాధునిక డిజిటల్ సాంకేతికతకు భారత్ సిద్ధంగా లేదనీ అన్నారు. అపుడు నేను మా బోర్డుకు ఏం చెప్పానంటే.. అధ్వాన పరిస్థితిలో మనం పెట్టిన డబ్బులు వెనక్కి రాకపోవచ్చు. అయినా ఏం కాదు. భారత్‌ను డిజిటలీకరణ చేయడానికి, దేశ టెలికాం రూపురేఖల్ని పూర్తిగా మార్చడానికి అది మనం చేసిన అత్యుత్తమ విరాళంగా మారుతుందని వివరించా. కానీ జియో వచ్చాక భారత టెలికాం మార్కెట్‌లో విప్లవమే సంభవించింది. జియోకు ముందు, తర్వాత అనేంతలా డేటా వినియోగం పెరిగింది. డేటా రేట్లు సైతం భారీగా దిగివచ్చాయి. ఇందువల్లే ఇప్పుడు మనదేశంలో 80 కోట్ల మందికి పైగా ఇంటర్నెట్ వినియోగదార్లున్నారు. అంతర్జాతీయంగా అతిపెద్ద ఆన్‌లైన్ మార్కెట్లలో ఒకటిగా భారత్ నిలిచింది. జియోకే 47 కోట్ల మంది వినియోగదార్లున్నారు. నేను ఎపుడూ పెద్ద సవాళ్లు ఎదుర్కోవడానికే ఇష్టపడతా. ఇప్పటిదాకా నేను తీసుకున్న అతిపెద్ద రిస్క్ జియోనే. ఆ సమయంలో సొంత డబ్బునే పెట్టుబడులుగా పెట్టాం. నేను అతిపెద్ద వాటాదారును' అంటూ అంబానీ వివరించారు.

మా నాన్న ఏం చెప్పారంటే..: 'రిలయన్స్ అనేది ఒక ప్రక్రియలా, ఎప్పటికీ నిలిచిపోయే సంస్థగా ఉండాలి. నా తర్వాత, నీ తర్వాత కూడా రిలయన్స్ కొనసాగాలి' అని మా నాన్న ధీరూభాయ్ నాకు చెప్పారు. 2027లో రిలయన్స్ తన స్వర్ణోత్సవం జరుపుకోనుంది. 100 ఏళ్ల తర్వాత కూడా భారత్‌కు రిలయన్స్ సేవలందించాలని అనుకుంటున్నా. 1960, 1970 నాటి రిలయన్స్‌కు 2000, 2020 నాటి రిలయన్స్‌కు చాలా తేడా ఉంది. ప్రపంచం ప్రతి 5, 10 ఏళ్లకూ మారుతుంటుంది. మనం నేర్చుకున్నదానికి భిన్నంగా అది వెళుతుంది. వాటన్నిటినీ మనం సవాలుగా స్వీకరించాలి. టెక్నాలజీలో అవకాశాల కోసం మేం పరుగులు తీసినపుడు, ప్రస్తుత అవకాశాల కంటే గొప్పగా అవి పరిణమించాయి. మరి వాటిని మేం ఎలా వదులుకుంటాం' అని ముకేశ్ పేర్కొన్నారు.

3040 ఏళ్లలో నేను నేర్చుకుందదే..: 'రిస్క్ తీసుకోవడంతో పాటు.. నా 3040 ఏళ్ల అనుభవంలో ఇంకో సూత్రాన్నీ నేర్చుకున్నా. ఉద్యోగుల కళ్లలోకి చూసి మాట్లాడాలనే మా ఉన్నతోద్యోగులకు చెబుతా. అపుడే మీరు మీ చిత్తశుద్ధిని వెల్లడించడానికి వీలవుతుందని చెప్పా. సంస్థాగత సంప్రదాయాలతోనే ఎటువంటి సవాలునైనా ఎదుర్కోగలమని నేను విశ్వసిస్తా' అంటూ అంబానీ స్పష్టం చేశారు.

**ప్రతీ 3-5 ఏళ్లకు కొత్త పెట్టుబడులు**

పూర్తి స్థాయి టెక్, అత్యాధునిక తయారీ కంపెనీగా మారేందుకు ప్రతి 35 ఏళ్లకోసారి తమ సంస్థల్లో పెట్టుబడులు పెడుతుంటామని ముకేశ్ అంబానీ తెలిపారు. 'భవిష్యత్తు కోసం ఎక్కువ పెట్టుబడులు పెట్టడం ద్వారా, దీర్ఘకాలంలో ప్రతిఫలాలు పొందేందుకే ఇష్టపడతా. రిలయన్స్ డీఎన్‌ఏ నే ఇది. సరైన నైపుణ్యం, లక్ష్యం ఉంటే.. మనకు ఏం కావాలి, ఎక్కడకు చేరాలి అన్నది తెలుస్తుంది. రిలయన్స్ తొలినాళ్లలో అంటే 4 దశాబ్దాల క్రితమే.. భారత్‌ను ఒక సౌభాగ్య దేశంగా మార్చడంలో కీలక పాత్ర పోషించాలని లక్ష్యంగా పెట్టుకుంది. అందుకు తగిన వ్యక్తులను నియమించుకున్నాం. మాకు మూడు 'సి'లపై దృష్టి ఉంటుంది. వ్యక్తిత్వం (క్యారక్టర్), పోటీతత్వం (కాంపిటెన్స్), సంప్రదాయం (కల్చర్).. ఈ మూడూ ముఖ్యం. వీటిల్లోనూ వ్యక్తిత్వమే ముఖ్యం. దీంతోనే అన్నీ అలవడతాయ'ని అంబానీ వివరించారు.

## అంతర్జాతీయ ఉద్రిక్తతల్లోనూ మనం ముందుకే ఆర్‌బీఐ బులెటిన్




**దిల్లీ:** అంతర్జాతీయంగా అనిశ్చితులున్నప్పటికీ.. పారిశ్రామిక, సేవల రంగాల్లో భారత ఆర్థిక కార్యకలాపాలు పుంజుకునే దిశలోనే సాగుతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) తెలిపింది. మే నెలకు సంబంధించి వివిధ కీలక సూచీల ఆధారంగా, ఈ విషయాన్ని జూన్ బులెటిన్‌లో బ్యాంక్ వెల్లడించింది. 202425లో ప్రధాన వ్యవసాయ పంటల్లో చాలా వాటి దిగుబడి పెరిగిందని తెలిపింది. రిటెయిల్ ద్రవ్యోల్బణం వరుసగా నాలుగో నెలా లక్ష్యం కంటే తక్కువగానే నమోదైందని పేర్కొంది. కీలక రేట్ల కోత ప్రయోజనాన్ని రుణ గ్రహీతలకు సత్వరమే బదిలీ చేసే అనువైన పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని వివరించింది. బులెటిన్‌లో ఇంకా ఏం ఉందంటే..

2025 ఏప్రిల్‌లో భారత్‌లోకి స్థూలంగా 8.8 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయి. నికర ఎఫ్‌డీఐ రెట్టింపునకు పైగా పెరిగి 3.9 బి.డాలర్లుగా నమోదైంది.

2025 జూన్ 20 వరకు ఆహార పదార్థాలకు సంబంధించి పప్పుధాన్యాల ధరలు తగ్గాయి. తృణ ధాన్యాల ధరలు స్వల్పంగా పెరిగాయి. సోయాబీన్, పొద్దు తిరుగుడు పువ్వు, ఆవ నూనెల ధరలు పెరగ్గా, పామాయిల్, వేరుసెనగ నూనె ధరలు తగ్గాయి. నీ ఉల్లి ధరలు మరింత దిగివచ్చాయి. బంగాళాదుంపలు, టమాటా ధరలు పెరిగాయి.

మేలోనూ పసిడి నిల్వలు యథాతథం: ఆర్‌బీఐ ఆర్‌బీఐ వరుసగా రెండో నెలా పసిడి కొనుగోళ్లు లేదా విక్రయానికి దూరంగా ఉంది. మే 30 నాటికి పసిడి నిల్వల్లో ఎలాంటి మార్పు లేకుండా 879.58 టన్నులుగా ఉంది. చివరిసారిగా మార్చి చివరివారంలో ఆర్‌బీఐ 570 కిలోల పసిడిని కొనుగోలు చేసింది. మే 30 నాటికి ఆర్‌బీఐ వద్ద ఉన్న పసిడి నిల్వల విలువ 84.3 బి.డాలర్లుగా నమోదైంది.

# చైనా ప్రొడక్ట్‌లపై యాంటీ–డంపింగ్ సుంకం



**వెల్లువెత్తే చౌక దిగుమతుల నుంచి దేశీ తయారీ సంస్థల ప్రయోజనాలను కాపాడే దిశగా ఈ నెలలో ఇప్పటివరకు ఆరు చైనా ఉత్పత్తులపై కేంద్రం యాంటీ–డంపింగ్ సుంకం విధించింది. పీఈడీప, ఎసిటోనైట్రైల్ (ఫార్మా రంగంలో ఉపయోగిస్తారు), విటమిన్–ఏ పామిటేట్, డెకోర్ పేపర్ మొదలైనవి వీటిలో ఉన్నాయి.**

**పరిశ్రమల్లో ఉపయోగించే ఈ ముడిసరుకులపై అయిదేళ్ల పాటు సుంకాలు ఉంటాయని వేర్వేరు నోటిఫికేషన్లలో కేంద్రీయ పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డ్ తెలిపింది. వాణిజ్య శాఖలో భాగమైన డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ట్రేడ్ రెమెడీస్ (డీజీటీఆర్) సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించింది. దిగుమతి సుంకాలు ఉత్పత్తిని బట్టి కేజీకి 20.87 డాలర్ల నుంచి టన్నుకు 2,017.9 డాలర్ల వరకు ఉంటాయి.**

**గత ఆర్థిక సంవత్సరంలో చైనాతో భారత్ వాణిజ్య లోటు 99.2 బిలియన్ డాలర్లకు చేరింది. చైనాకు ఎగుమతులు 14.5 శాతం క్షీణించి 14.25 బిలియన్ డాలర్లకు పరిమితం కాగా, దిగుమతులు 11.52 శాతం పెరిగి 113.45 బిలియన్ డాలర్లకు ఎగిశాయి.**




# అగ్రగామి ఫిన్‌టెక్ హాట్‌స్పాట్స్‌లో భారత్

**దిల్లీ:** ప్రపంచంలో అగ్రగామి ఫిన్‌టెక్ హాట్‌స్పాట్స్‌లో భారత్ ఒకటని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వెల్లడించింది. అమెరికా, బ్రిటన్ వంటి దేశాల సరసన భారత్ నిలిచినట్లు తెలిపింది. చైనాలోని టియాన్‌జిన్‌లో జరిగిన వార్షిక సమావేశంలో ఈ నివేదికను డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసింది. లాభదాయకత పెరుగుతున్న నేపథ్యంలో ఫిన్‌టెక్ రంగం స్థిరీకరించుకుంటోందని పేర్కొంది. అగ్రగామి ఫిన్‌టెక్ హాట్‌స్పాట్స్ అయిన బ్రిటన్, భారత్, అమెరికా, సింగపూర్, బ్రెజిల్, ఇండోనేషియాల్లో 10 సంస్థలకు చెందిన ప్రధాన కార్యాలయాలు ఉన్నాయి. ఫిన్‌టెక్ రంగం దూసుకెళ్లడాన్ని ఇది సూచిస్తోంది. ఫిన్‌టెక్ సంస్థలు ఎక్కువగా కార్యకలాపాలు సాగిస్తున్న దేశాల్లో అమెరికా, బ్రిటన్, భారత్, సింగపూర్, యూఏఈ, బ్రెజిల్, కొలంబియా, మెక్సికో, ఇండోనేషియా, జర్మనీ వంటి దేశాలు ఉన్నాయని పేర్కొంది. కరోనా ప్రభావం ఉన్నప్పటికీ.. ఫిన్‌టెక్ రంగం బలమైన, స్థిరమైన వృద్ధి సాధిస్తూ, కొత్త వర్గాలకు చేరువైనట్లు వివరించింది. ప్రపంచవ్యాప్తంగా నిర్వహించిన ఈ సర్వేలో 240 ఫిన్‌టెక్ సంస్థలు పాల్గొన్నాయి. వినియోగదారుల వృద్ధి స్థిరీకరించుకుంటున్నట్లు 37%, ఆదాయ వృద్ధితో ఆర్థిక పనితీరు బలంగా ఉన్నట్లు 40%, లాభంలో వృద్ధి సాధించినట్లు 39% సంస్థలు వెల్లడించాయి. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీకి చెందిన కేంబ్రిడ్జ్ సెంటర్ ఫర్ ఆల్టర్నేటివ్ ఫైనాన్స్ భాగస్వామ్యంలో డబ్ల్యూఈఎఫ్ ఈ సర్వే చేపట్టింది. ఫిన్‌టెక్ ఖాతాదారుల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థ (ఎంఎస్‌ఎంఈ)లు, తక్కువ ఆదాయం కలిగిన వ్యక్తులు, మహిళల వాటా వరుసగా 57%, 47%, 41 శాతంగా నమోదైంది. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగంతో పనితీరు మెరుగుపడుతోందని 83% సంస్థలు అభిప్రాయపడ్డాయి.

ఫిన్‌టెక్ సంస్థల వృద్ధికి అడ్డంకిగా స్థూల ఆర్థిక పరిస్థితులున్నట్లు 18% సంస్థలు తెలిపాయి. 2024లో ఇవి 56 శాతంగా ఉన్నాయి.

## చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయా?



సుకన్య సమృద్ధి యోజన , పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల వడ్డీ రేట్లపై త్వరలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. జులైసెప్టెంబర్ త్రైమాసికానికి గానూ ఈనెలాఖరులోగా ప్రకటన చేయనుంది. సవరించిన వడ్డీ రేట్లు జులై 1 నుంచి వర్తిస్తాయి. అయితే, ఈసారి వడ్డీ రేట్లు తగ్గుతాయన్న ప్రచారం జరుగుతోంది. కారణమేంటి? రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపో రేటును ఇటీవలకాలంలో తగ్గించింది. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు మూడు దఫాల్లో 100 బేసిస్ పాయింట్లను తగ్గించింది. దీంతో బ్యాంకులు కూడా ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను తగ్గించాయి. ఆర్‌బీఐ రెపోరేటును తగ్గించినప్పుడు బాండ్ల రాబడిపై కూడా ప్రభావం పడుతుంది. ఆర్‌బీఐ రెపో రేటు ఒక శాతం మేర తగ్గడంతో బాండ్లపై రాబడి కూడా ఆ మేరకు తగ్గుముఖం పట్టింది.

'చిన్న' పథకాలతో సంబంధం ఏంటి? పోస్టాఫీసు సేవింగ్ స్కీమ్స్‌పై వడ్డీ అనేది శ్యామలా గోపీనాథ్ కమిటీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం నిర్ణయిస్తోంది. ప్రతి త్రైమాసికానికి వడ్డీ రేట్లు నిర్ణయించేటప్పుడు సెకండరీ మార్కెట్‌లో ట్రేడయ్యే బాండ్ల రాబడిని పరిగణనలోకి తీసుకోవాలని ఈ కమిటీ సూచించింది. పథకాలను బట్టి 25 నుంచి 100 బేసిస్ పాయింట్ల వరకు అదనపు వడ్డీని జోడించాలని ఈ కమిటీ సిఫార్సు చేసింది. దీన్ని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదించింది. ఈ కమిటీ సిఫార్సుల ప్రకారం.. పోస్టాఫీసు అందించే 5 ఏళ్ల టైమ్ డిపాజిట్‌కు 5 ఏళ్ల గవర్నమెంట్ సెక్యూరిటీలపై వచ్చే వడ్డీని ప్రాతిపదికగా తీసుకుంటారు. దానికి 25 బేసిస్ పాయింట్లు జోడించి వడ్డీ రేటును నిర్ణయిస్తారు. ఈ ఏడాది మార్చి 24 నుంచి జూన్ 24 మధ్య 10 ఏళ్ల ప్రభుత్వ సెక్యూరిటీలపై వచ్చే సగటు రాబడికి 25 బేసిస్ పాయింట్లు జోడించి పీపీఎఫ్‌పై వడ్డీ నిర్ణయిస్తారు. ఈ కాలానికి బాండ్లపై 6.325 శాతం వడ్డీ లభించగా.. కమిటీ ప్రతిపాదించిన ఫార్ములా ప్రకారం 25 బేసిస్ పాయింట్లు జోడిస్తే 6.575 శాతం వడ్డీ అవుతుంది. ప్రస్తుతం పీపీఎఫ్‌పై 7.10 శాతం వడ్డీ అందుతోంది. ఈ నేపథ్యంలో చిన్న మొత్తాల పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు తగ్గుతాయన్న ప్రచారం జరుగుతోంది. కొన్నిసార్లు ప్రభుత్వం ఈ సూత్రాన్ని పక్కనపెట్టిన సందర్భాలూ ఉన్నాయి. మరి బాండ్ల రాబడి ఆధారంగానే వడ్డీ రేట్లు తగ్గిస్తారా? పాత రేట్లనే కొనసాగిస్తారో చూడాలి మరి!

# మాజీ ప్రియుడి బర్త్ డే.. స్పెషల్‌గా విష్ చేసిన బాలీవుడ్ భామ!



బాలీవుడ్ భామ మలైకా అరోరా పేరు చెప్పగానే ఐటమ్ సాంగ్సే గుర్తొస్తాయి. ఆ తర్వాత ఆమె డేటింగ్ వ్యవహారం గుర్తొస్తుంది. ఎందుకంటే హీరో సల్మాన్ ఖాన్ తమ్ముడు అర్బాజ్ ఖాన్ పెళ్లి చేసుకున్న ఈమె.. దాదాపు 19 ఏళ్ల తర్వాత విడాకులు తీసుకుంది. ఆ తర్వాత కొన్నేళ్లకు తన కంటే చిన్నవాడైన అర్జున్ కపూర్‌తో ప్రేమాయణం నడిపించింది. అయితే వీరి ప్రేమబంధం ఎక్కువ రోజులు నిలవలేదు. దాదాపు ఆరేళ్ల డేటింగ్ అనంతరం బ్రేకప్ చెప్పేసుకుని అభిమానులకు షాకిచ్చారు. అయితే కొన్నినెలల క్రితం ఐపీఎల్ మ్యాచ్‌లో శ్రీలంక మాజీ క్రికెటర్ కుమార సంగక్కర పక్కన మలైకా కనిపించడంతో వీరిద్దరు డేటింగ్‌లో ఉన్నారా? అంటూ రూమర్స్ వినిపించాయి. అయితే దీనిపై ఎవరూ కూడా స్పందించలేదు.

తాజాగా తన మాజీ భాయ్ ఫ్రెండ్ అర్జున్ కపూర్ బర్త్ డే కావడంతో విషెస్ తెలిపింది ముద్దుగుమ్మ. ఈ మేరకు తన ఇన్‌స్టాలో పోస్ట్ చేసింది. హ్యాపీ బర్త్‌డే, అర్జున్ కపూర్' మాజీ ప్రియుడికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపింది. ప్రస్తుతం ఒంటరిగానే ఉంటోన్న మలైకా అరోరా మాజీ లవర్‌కు విషెస్ చెప్పడంపై నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. అయితే గతేడాది బ్రేకప్ చెప్పుకున్న ఈ జంట మాత్రం సోషల్ మీడియాలో ఫ్రెండ్‌షిప్ కొనసాగిస్తూనే ఉన్నారు. కాగా.. అర్జున్ కపూర్ ఇటీవలే తెరపైకి వచ్చిన 'మేరే హస్బెండ్ కి బివి' అనే రొమాంటిక్ కామెడీ చిత్రంలో కనిపించారు. ప్రస్తుతం 'నో ఎంట్రీ 2' అనే మూవీలో నటించనున్నారు.




# ప్రియమణి థ్రిల్లర్ సిరీస్.. స్ట్రీమింగ్ డేట్ ఫిక్స్

ప్రియమణి, సంపత్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సిరీస్ 'గుడ్ వైఫ్'. అమెరికన్ సిరీస్ 'గుడ్ వైఫ్' అదే పేరుతో రీమేక్ చేస్తున్నారు. సెక్స్ కుంభకోణంలో చిక్కుకున్న భర్తని రక్షించుకునేందుకు ఓ మాజీ మహిళ లాయర్ ఏం చేసింది? అనే కోణంలో ఈ సిరీస్‌ను రూపొందించారు. ఇందులో ప్రియమణి లాయర్‌గా కనిపించనుండగా.. ఆమె భర్త పాత్రలో సంపత్ రాజ్ నటించారు.

తాజాగా ఈ సిరీస్ స్ట్రీమింగ్ డేట్‌ను మేకర్స్ రివీల్ చేశారు. జూలై నాలుగో తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ థ్రిల్లర్ వెబ్ సిరీస్ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, బెంగాలీ, మరాఠీ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. తమిళ వర్షన్ ట్రైలర్ రిలీజ్ చేస్తూ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు.



# బీజేపీలోకి నటి మీనా?

తమిళనాడు: సినిమాల్లో రాణించిన చాలా మంది తదుపరి లక్ష్యం రాజకీయాలుగా మారుతోంది. ఇప్పటికే పలువురు నటీనటులు తమకు అనుకూలమైన రాజకీయ పార్టీల్లో ఉన్నారు. కాగా తాజాగా నటి మీనా పేరు వెలుగులోకి వచ్చింది. మీనా త్వరలో రాజకీయ రంగప్రవేశం చేయనున్నారని, భారతీయ జనతా పార్టీలో చేరనున్నారని ప్రచారం జోరందుకుంది. త్వరలోనే దీనికి సంబంధించిన ప్రకటన వెలువడే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

# కన్నప్పలో చేయమని మోహన్‌బాబు అడిగితే ఆలోచించా: శివబాలాజీ



''కన్నప్ప' చిత్రంలో మహదేవశాస్త్రి (మోహన్‌బాబు పాత్ర) కొడుకుగా యాక్ట్ చేయమని మోహన్‌బాబుగారు అన్నప్పుడు ఆలోచించాను. మరీ సైడ్‌కి అలా నిలబడే పాత్ర ఎలా చేయాలని విష్ణుని అడిగితే, 'నీ ఇష్టం' అన్నారు. మా ఆవిడ మధుమిత కూడా అలానే అన్నారు. ఫైనల్‌గా ఒప్పుకున్నాను. అయితే ఈ చిత్రంలో ఆ పాత్ర చేసి ఉండకపోతే నేను చాలా మిస్ అయ్యేవాణ్ని. ఇప్పుడు నాకు ఆ పాత్ర గొప్పదనం అర్థమైంది'' అని శివ బాలాజీ అన్నారు.

విష్ణు మంచు హీరోగా ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'కన్నప్ప'. మంచు మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ చిత్రంలో నటించిన శివ బాలాజీ మాట్లాడుతూ– ''కన్నప్ప'లో నా పాత్ర నిడివి, ప్రాముఖ్యత కాస్త తక్కువగా ఉంటుంది. కానీ, ఓ గొప్ప చిత్రం, పాన్ ఇండియన్ సినిమాలో భాగం అవ్వాలనే ఉద్దేశంతో ఇంకేమీ ఆలోచించకుండా ఒప్పుకున్నాను. ఈ చిత్రంలో ప్రభాస్, విష్ణు పాత్రల మధ్య వచ్చే సంభాషణలు అద్భుతంగా అనిపిస్తాయి. ఇక నేను చేసిన 'రెక్కీ' సినిమాకి అద్భుతమైన స్పందన వచ్చింది. 'రెక్కీ 2' త్వరలోనే రానుంది. ప్రస్తుతం 'సిందూరం' అనే చిత్రం చేశాను. అలాగే మోహన్‌బాబుగారి ప్రొడక్షన్‌లో నేను హీరోగా ఓ సినిమా చేస్తున్నాను'' అన్నారు.

# ప్రతి ఒక్కరూ ఒక సైనికుడిలా మారదాం: రామ్ చరణ్



తెలంగాణ ప్రభుత్వం చేస్తోన్న కృషికి టాలీవుడ్ నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఎఫ్‌డీసీ ఛైర్మన్, సినీ నిర్మాత దిల్‌రాజు అన్నారు. డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని తెలిపారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మలయాళ చిత్ర పరిశ్రమలాగే మనం కూడా ఇండస్ట్రీలో డ్రగ్స్ వాడేవారిపై నిషేధం విధించేలా సినీ పెద్దలతో మాట్లాడి నిర్ణయం తీసుకుందామని అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన టాలీవుడ్ హీరోలు రామ్ చరణ్, విజయ్ దేవరకొండ డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. రామ్ చరణ్ మాట్లాడుతూ..' మంచి మార్క్స్ తెచ్చుకోవడం ఒక మంచి హై.. ఫ్యామిలీతో క్వాలిటీ టైం గడిపితే అది మంచి హై.. ఈవెనింగ్ స్పోర్ట్స్ ఆడి ఫ్రెష్ అయితే అది ఒక మంచి హై.. గోపిచంద్ చెప్పినట్లు ఆ హై వేరు.. మనల్ని మనమే రక్షించుకుందాం.. డ్రగ్స్‌కి యువత దూరంగా ఉండాలి.. జీవితాలని పాడుచేసుకోకూడదు.. మన సొసైటీ మనమే క్లీన్ చేసుకుందాం. గతంలో కొన్ని స్కూల్స్ బయట డ్రగ్స్ అమ్ముతున్నారని తెలిసి బాధేసింది. అప్పుడు నేను తండ్రిని కాదు. ఇప్పుడు నేను కూడా ఒక తండ్రిని. ఒక విజయవంతమైన సినిమా చేసినప్పుడు ఎంతో గర్వంగా ఉంటుంది. మన కుటుంబంతో మొదలు పెట్టి స్కూల్, సమాజం బాగుచేసుకుందాం. ఈ విషయంలో పోలీస్‌శాఖ కృషిని ప్రశంసిస్తున్నా. ప్రతి ఒక్కరూ ఒక్కో సైనికుడిలా మారదాం.. డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం' అని పిలుపునిచ్చారు.

విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. 'ఒక్కసారి ట్రై చేయిరా అనే వాళ్లు ఉంటారు. కానీ ఒక్కసారి అటువైపు వెళ్తే ఇక బయటపడటం కష్టం. ఎవరైనా మనకు అలాంటి వాళ్లు కనపడితే వారికి దూరగా ఉందాం. జిమ్‌లో మంచి వర్కవుట్ చేస్తే మంచిగా అనిపిస్తది. నాకు డబ్బులు సంపాదించినప్పుడు ఒక హై వస్తది. డబ్బులు ఇంకొకరికి ఇచ్చి హెల్ప్ చేస్తున్నప్పుడు ఒక హై వస్తది. నచ్చిన పని చేస్తున్నప్పుడు ఒక హై వస్తది. నచ్చిన పని చేసి సక్సెస్ అందుకున్నప్పుడు ఒక హై వస్తది. ఛేజ్ ది సక్సెస్ ... డ్రగ్స్ వంటి నెగిటివిటీకి దూరంగా ఉండండి. మిమ్మల్ని చూసి మీ పేరెంట్స్ గర్వపడతారు. సమాజంలో మీకంటూ ప్రత్యేక గుర్తింపు వస్తది. అందుకే మన డ్రగ్స్‌కి దూరంగా ఉందాం. ఆరోగ్యమైన సమాజాన్ని నిర్మిద్దాం. మీ ప్రేమకు ధన్యవాదాలు' అని అన్నారు.

# జయ్ వర్మతో డేటింగ్ రూమర్స్‌పై హీరోయిన్ క్లారిటీ.. మూర్ఛ వ్యాధి వల్ల..



బాలీవుడ్ హీరో విజయ్ వర్మ.. తమన్నాకు బ్రేకప్ చెప్పాక మరో హీరోయిన్‌తో ప్రేమలో పడ్డాడని కొంతకాలంగా ప్రచారం జరుగుతోంది. దంగల్ బ్యూటీ ఫాతిమా సనా షైఖ్ తో పలుమార్లు కనిపించడంతో వీళ్లు లవ్ బర్డ్స్ అయుండొచ్చని పలువురూ అభిప్రాయపడ్డారు. కానీ, అందులో ఏమాత్రం నిజం లేదంటోంది ఫాతిమా. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. ప్రేమలో ఉన్నప్పుడు ఇద్దరూ సమాన గౌరవం ఇచ్చిపుచ్చుకోవాలి. ఒకరు చెప్పేది మరొకరు వినాలి.

**సింగిల్ లైఫ్**

కొన్నిసార్లు ఒకరి కోసం మరొకరు కాంప్రమైజ్ అవ్వాలి. మిమ్మల్ని మీరు కోల్పోకుండా మీ అనుబంధాన్ని ముందుకు నడిపించాలి. అప్పడే ఆ బంధం విజయవంతంగా కొనసాగుతుంది. అలాంటి వ్యక్తి నా జీవితంలో ఎవరూ లేరు. మంచివాళ్లు కేవలం సినిమాల్లోనే ఉంటారు అంటూ తన రిలేషన్‌షిప్ స్టేటస్ సింగిల్ అని వెల్లడించింది. అలాగే తన అనారోగ్యం గురించి మాట్లాడుతూ.. నాకు మూర్ఛ రోగం ఉంది. అమెరికా వెళ్తున్నప్పుడు విమానంలో ఉండగా మూర్ఛ వచ్చింది. దాంతో నన్ను ఎయిర్‌పోర్ట్ హాస్పిటల్‌కు తీసుకెళ్లి చికిత్స అందించారు.

**ఫిట్స్ వచ్చి పడిపోయా**

అయినా మూర్ఛ తగ్గకపోవడంతో ఎక్కువ డోసు ఇచ్చారు. దానివల్ల నా శరీరం ఎఫెక్ట్ అయింది. బెడ్‌రెస్ట్ తీసుకోక తప్పలేదు. అప్పుడు నా చేతిలో రెండు సినిమాలున్నాయి. వాటి షూటింగ్స్ క్యాన్సిల్ చేసుకోవాల్సి వచ్చింది. షూటింగ్‌కు రమ్మని పిలిచినప్పుడు బాధ తట్టుకోలేక ఏడ్చేశాను. నాకున్న మూర్ఛ వ్యాధి గురించి అందరికీ చెప్పాలని డిసైడయ్యాను. అప్పడే నాకు ఫిట్స్ ఉన్నట్లు వెల్లడించాను అని చెప్పుకొచ్చింది. ఫాతిమా.. మాధవన్ సరసన ఆప్ జైసా కోయ్ మూవీలో నటించింది. ఈ చిత్రం జూలై 11న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఫాతిమా నటించిన మరో చిత్రం 'మెట్రో ఇన్ డినో' జూలై 4న థియేటర్లలో రిలీజవుతోంది.



# అఖిల భారత చెస్ సమాఖ్య కొత్త పథకం

**న్యూఢిల్లీ:** యువ క్రీడాకారులకు ఆర్థికపరంగా అండగా నిలిచేందుకు అఖిల భారత చెస్ సమాఖ్య (ఏఐసీఎఫ్) కొత్త పథకంతో ముందుకు వచ్చింది. ఇకపై జాతీయ స్థాయి క్రీడాకారులకు శిక్షణ తదితర అవసరాల కోసం ఉపకార వేతనం అందిస్తామని ప్రకటించింది. దీనికి సంబంధించి ఏప్రిల్-జూన్ మధ్య కాలానికి ఇప్పటికే రూ. 42.30 లక్షలను నేరుగా ఆటగాళ్ల అకౌంట్లకు బదిలీ చేసింది.

ఈ పథకం ద్వారా ప్రయోజనం అందుకునే వారిలో అండర్-7 నుంచి అండర్-19 వయో విభాగాల క్రీడాకారులు ఉన్నారు. రూ. 60 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు ఒక్కో ఆటగాడికి లభించాయి. 'భారత చెస్‌లో తొలిసారి బాలుర విభాగంలో 39 మంది, బాలికల విభాగంలో 39 మంది ఆటగాళ్లను గుర్తించి భవిష్యత్తు కోసం వారిని తీర్చిదిద్దుతున్నాం. దీని ద్వారా వారికి కీలక దశలో ఆర్థికపరంగా వెసులుబాటు లభిస్తుంది.

ఇతరత్రా కూడా అన్ని రకాలుగా మేం మద్దతు అందిస్తాం. మరోవైపు జాతీయ స్థాయి టోర్నీల సంఖ్యను పెంచి పోటీల్లో పాల్గొనే అవకాశాలు కూడా పెంచుతాం. దాని వల్ల మంచి ప్రతిభ వెలుగులోకి వస్తుంది' అని ఏఐసీఎఫ్ అధ్యక్షుడు నితిన్ నారంగ్ తెలిపారు. ఈ జాబితాలో తెలంగాణ నుంచి దివిత్ రెడ్డి , నిధీశ్ శ్యామల్ (అండర్-9), శ్రీరామ్ ఆదర్శ్ ఉప్పల, బి. కీర్తిక (అండర్-17), శరణ్య దేవి నరహరి (అండర్-13), ఆదిరెడ్డి అర్జున్, వేల్పుల సరయు (అండర్-19) ఉన్నారు.



# చరిత్ర సృష్టించిన లిట్టన్ దాస్

బంగ్లాదేశ్ వికెట్‌కీపర్ లిట్టన్ దాస్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్ట్‌ల్లో ఆ దేశం తరపున అత్యధిక మంది ఔట్ చేయడంలో భాగమైన వికెట్ కీపర్‌గా రికార్డు నెలకొల్పాడు. కొలాంబో వేదికగా శ్రీలంకతో జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌లో దినేశ్ చండీమల్ క్యాచ్ పట్టడం ద్వారా లిట్టన్ దాస్ ఈ ఘనత సాధించాడు. లిట్టన్‌కు ముందు బంగ్లాదేశ్ తరపున టెస్ట్‌ల్లో అత్యధిక డిస్మిసల్స్ రికార్డు ముష్ఫికర్ రహీం పేరిట ఉంది.

ముష్ఫికర్ 99 ఇన్నింగ్స్‌ల్లో 113 డిస్మిసల్స్‌లో (98 క్యాచ్‌లు, 15 స్టంపౌట్లు) భాగంగా కాగా.. లిట్టన్ కేవలం 65 ఇన్నింగ్స్‌ల్లోనే (114) ముష్ఫికర్ రికార్డును బద్దలు కొట్టాడు. లిట్టన్ డిస్మిసల్స్‌లో 99 క్యాచ్‌లుండగా.. 15 స్టంపౌట్లు ఉన్నాయి.

**బంగ్లాదేశ్ తరపున టెస్ట్‌ల్లో విజయవంతమైన టాప్-4 వికెట్ కీపర్లు..**
**లిట్టన్ దాస్-114**
**ముష్ఫికర్ రహీం-113**
**ఖలీద్ మసూద్-87**
**నురుల్ హసన్-34**

మ్యాచ్ విషయానికొస్తే.. కొలాంబో వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో శ్రీలంక పైచేయి సాధించింది. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 290 పరుగులు చేసి, 43 పరుగుల ఆధిక్యం సాధించింది. ఓపెనర్ పథుమ్ నిస్సంక (146) వరుసగా రెండో మ్యాచ్‌లో సెంచరీ చేసి ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తున్నాడు. అతనికి జతగా ఓవర్‌నైట్ బ్యాటర్ ప్రభాత్ జయసూర్య (5) క్రీజ్‌లో ఉన్నాడు.

లంక ఇన్నింగ్స్‌లో దినేశ్ చండీమల్ (93) తృటిలో సెంచరీ చేజార్చుకోగా.. మరో ఓపెనర్ లహీరు ఉడారా 40 పరుగులతో రాణించాడు. తైజుల్ ఇస్లాం, నయీమ్ హసన్‌కు తలో వికెట్ దక్కింది.

అంతకుముందు బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 247 పరుగులకు ఆలౌటైంది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి 8 వికెట్ల నష్టానికి 220 పరుగులు చేసిన బంగ్లాదేశ్ ఇవాళ (రెండో రోజు) మరో 27 పరుగులు జోడించి మిగతా 2 వికెట్లు కోల్పోయింది.

బంగ్లా ఇన్నింగ్స్‌లో ఓపెనర్ షద్మాన్ ఇస్లాం (46) టాప్ స్కోరర్ కాగా.. మొమినుల్ హక్ (21), ముష్ఫికర్ రహీం (35), లిటన్ దాస్ (34), మెహిది హసన్ మిరాజ్ (31), నయీమ్ హసన్ (25), తైజుల్ ఇస్లాం (33) రెండంకెల స్కోర్లు చేశారు. అనాముల్ హక్ 0, కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో 8, ఎబాదత్ హొసేన్ 8 పరుగులకు ఔటయ్యారు. బంగ్లా ఇన్నింగ్స్‌ను అశిత ఫెర్నాండో (182513), విశ్వ ఫెర్నాండో (194452), సోనల్ దినుష (9.33223), ధనంజయ డిసిల్వ (50151), తిరందు రత్నాయకే (171721) దెబ్బకొట్టారు.

**నిస్సంక వరుస సెంచరీలు**

శ్రీలంక బ్యాటింగ్ సంచలనం, ఆ జట్టు ఓపెనర్ పథుమ్ నిస్సంక వరుస సెంచరీలతో చెలరేగిపోతున్నాడు. బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో భారీ శతకంతో (187) విరుచుకుపడిన అతను.. ప్రస్తుతం జరుగుతున్న రెండో టెస్ట్‌లోనూ అద్భుత శతకంతో (146 నాటౌట్) మెరిశాడు.

కాగా, రెండు టెస్ట్‌లు, మూడు వన్డేలు, మూడు టీ20ల సిరీస్‌ల కోసం బంగ్లాదేశ్ జట్టు శ్రీలంకలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్ డ్రాగా ముగిసింది. ఆ మ్యాచ్‌లో ఇరు జట్లు ఆటగాళ్లు అద్భుతంగా బ్యాటింగ్ చేశారు.

ఇరు జట్ల తరపున నాలుగు సెంచరీలు నమోదయ్యాయి. బంగ్లా కెప్టెన్ నజ్ముల్ హసన్ షాంటో రెండు ఇన్నింగ్స్‌ల్లో (148, 125 నాటౌట్) సెంచరీలు చేయగా.. ముష్ఫికర్ రహీం (163), పథుమ్ నిస్సంక (187) తమతమ తొలి ఇన్నింగ్స్‌ల్లో సెంచరీలు చేశారు.

# ప్లీజ్ ఆ విన్యాసాలు వద్దు.. పంత్‌ని కోహ్లీతో పోల్చాలి.. ధోనీతో కాదు: అశ్విన్

టీమ్ఇండియా వికెట్‌కీపర్ రిషభ్ పంత్‌పై మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ప్రశంసలు కురిపించాడు. ఇంగ్లాండ్‌తో లీడ్స్ వేదికగా జరిగిన తొలి టెస్టులో పంత్ రెండు సెంచరీలు (134, 118) చేసిన సంగతి తెలిసిందే. పంత్ తన శతకాలను డబుల్ సెంచరీలుగా మరల్చాలని కోరాడు. టెస్టుల్లో శరీరం అలసిపోతుందని, శతకం చేసిన తర్వాత ఫ్రంట్ ఫ్లిప్ కొట్టి సంబరాలు చేసుకోవద్దని విజ్ఞప్తి చేశాడు. లీడ్స్ టెస్టులో తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ చేసిన తర్వాత 'సోమర్‌సాల్ట్' విన్యాసం చేస్తూ పంత్ వినూత్నంగా సంబరాలు చేసుకున్నాడు. ఐపీఎల్ 2025లో ఆర్సీబీపై శతకం చేసినప్పుడు కూడా పంత్ ఇలానే సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. తొలి టెస్టులో భారత్ ఓటమి అనంతరం అశ్విన్ తన యూట్యూబ్ ఛానల్‌లో టీమ్ఇండియా గురించి మాట్లాడుతూ వివిధ అంశాలు ప్రస్తావించాడు.

**రన్స్ చేయడం కాదు.. ఆ విషయంపై దృష్టిపెట్టాలి**

'టీమ్ఇండియా బ్యాటర్లు ప్రతి ఇన్నింగ్స్‌లోనూ ఒక విషయంపై దృష్టి పెట్టాలి. అదేంటంటే.. పరుగులు సాధించడం కంటే కూడా వీలైనంత ఎక్కువసేపు క్రీజులో ఉండాలి. ఎక్కువ సమయం క్రీజులో ఉండి ఇంగ్లాండ్ జట్టు ఫీల్డింగ్‌లో అలసిపోయేలా చేయాలి. ఓటమికి భయపడాల్సిన పనిలేదు. తుది జట్టులో భారీగా మార్పులు చేయకూడదు. రెండో టెస్టులో గెలిచి సిరీస్ సమం చేయగల సత్తా టీమ్ఇండియాకు ఉంది. అయితే, ఇంగ్లాండ్ వ్యూహాలను సరిగ్గా అర్థం చేసుకుంటేనే ఇది సాధ్యమవుతుంది. లేదంటే సిరీస్ తొందరగానే మన నుంచి చేజారిపోవచ్చు.

**ఐదో రోజు వరకు బ్యాటింగ్ చేయకపోతే**

ఐదో రోజు వరకు బ్యాటింగ్ చేయాలి. లేకపోతే కథ ముగిసిపోతుంది. ఐదో రోజు ఎంత పెద్ద లక్ష్యాన్నైనా ఛేదిస్తామని ఇంగ్లాండ్ జట్టు చెప్పింది. కాబట్టి.. ఈ విషయాన్ని మన బ్యాటింగ్ లైనప్ గుర్తుంచుకోవాలి. ప్రత్యర్థికి తక్కువ సమయం ఇచ్చి పెద్ద టార్గెట్ ముందుంచాలి. ప్రస్తుత పరిస్థితుల్లో కనీసం 400450 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశిస్తేనే మనం మ్యాచ్ గెలవగలం. పిచ్‌ను బట్టి ఆటను మార్చుకుంటూ ఉండాలి.

**పంత్‌ని కోహ్లీతో పోల్చాలి.. ధోనీతో కాదు**

రిషభ్ పంత్‌ని ధోనీతో సరిపోల్చడం సముచితం కాదు. ఎందుకంటే పంత్ ఎక్కువసార్లు ఐదో స్థానంలో బ్యాటింగ్ చేయలేదు. అతడిని విరాట్ కోహ్లీలాంటి వారితో పోల్చాలి. అతడు ప్రధానంగా బ్యాటర్ కావడమే ఇందుకు కారణం. అంతేకాకుండా ఇంకా చాలా కెరీర్ ఉంది. బంతి లైన్, లెంగ్త్‌ని ముందుగానే అంచనా వేసి ప్రత్యేకమైన షాట్లు ఆడతాడు. ఈ ప్రత్యేక నైపుణ్యం ఉన్న అరుదైన ఆటగాళ్లలో రిషబ్ పంత్ ఒకరు. పంత్‌కు నాది ఒకే ఒక విన్నపం. దయచేసి ఆ ఫ్రంట్ ఫ్లిప్ చేయవద్దు. ఐపీఎల్‌లో శరీరం ఎక్కువగా అలసిపోదు. అప్పుడు ఫ్లిప్‌లు కొట్టినా ఫర్వాలేదు. కానీ, టెస్టు క్రికెట్ భిన్నమైంది' అని అశ్విన్ అభ్యర్థించాడు.



# విధ్వంసం సృష్టించిన ఆర్సీబీ స్టార్





**మేజర్ లీగ్ క్రికెట్‌లో ఆర్సీబీ స్టార్ ఆటగాడు, శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ ఆల్‌రౌండర్ రొమారియో షెపర్డ్ చెలరేగిపోయాడు. సియాటిల్ ఓర్కాస్‌తో ఇవాళ (భారతకాలమానం ప్రకారం) జరిగిన మ్యాచ్‌లో విధ్వంసం సృష్టించాడు.**

ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 31 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సర్ల సాయంతో 56 పరుగులు చేశాడు. అనంతరం బౌలింగ్‌లోనూ రెచ్చిపోయాడు. 3 ఓవర్లలో కేవల 16 పరుగులిచ్చి 2 వికెట్లు తీశాడు. షెపర్డ్ ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టడంతో శాన్‌ఫ్రాన్సిస్కో యూనికార్న్స్ సియాటిల్ ఓర్కాస్‌పై 32 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో డబుల్ హ్యాట్రిక్ విజయాలు సాధించిన యూనికార్న్స్ ప్లే ఆఫ్స్‌కు చేరిన తొలి జట్టుగా నిలిచింది. షెపర్డ్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. షెపర్డ్ తాజాగా ముగిసిన ఐపీఎల్ సీజన్‌లో సీఎస్‌కేపై 14 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి సంచలనం సృష్టించాడు. తాజాగా అదే తరహా ప్రదర్శన చేసి వార్తల్లో నిలిచాడు. ఈ ప్రదర్శన షెపర్డ్‌కు వచ్చే ఐపీఎల్ సీజన్ రిటెన్షన్‌కు ఉపయోగపడవచ్చు. షెపర్డ్ ప్రస్తుత ఎం ఎల్‌సీ సీజన్‌లో ఓ మోస్తరు ప్రదర్శనలతో పర్వాలేదనిపిస్తున్నాడు.

మ్యాచ్ విషయానికొస్తే.. తొలుత బ్యాటింగ్ చేసిన యూనికార్న్స్.. షెపర్డ్ (56), మాథ్యూ షార్ట్ (52) మెరుపు అర్ధ సెంచరీలతో విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (34) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

మిగతా ఆటగాళ్లలో ఫిన్ అలెన్ (4), సంజయ్ కృష్ణమూర్తి (4), హసన్ ఖాన్ (1), జేవియర్ బార్ట్‌లెట్ (3), హ్యామిల్టన్ (6) నిరాశపరిచారు. ఓర్కాస్ బౌలర్లలో హర్మీత్ సింగ్, కొయెట్జీ తలో 3 వికెట్లు తీయగా.. ఒబెద్ మెక్‌కాయ్, గానన్ చెరో వికెట్ తీశారు.అనంతరం ఓ మోస్తరు లక్ష్య ఛేదనకు దిగిన ఓర్కాస్.. హరీస్ రౌఫ్ (40324) నిప్పులు చెరగడంతో 18.2 ఓవర్లలో 144 పరుగులకే ఆలౌటైంది. రౌఫ్‌కు మాథ్యూ షార్ట్ (40123), షెపర్డ్ (30162), బార్ట్‌లెట్ (2.20371) కూడా జత కలవడంతో ఓర్కాస్ ఇన్నింగ్స్ పేకమేడలా కూలింది.

ఓర్కాస్ జట్టులో ఓపెనర్ షయాన్ జహంగీర్ (40), షిమ్రోన్ హెట్‌మైర్ (30), డేవిడ్ వార్నర్ మాత్రమే ఓ మోస్తరు స్కోర్లు చేశారు. కైల్ మేయర్స్ (0), హెన్రిచ్ క్లాసెన్ (7) వైఫల్యాల పరంపరను కొనసాగించారు. ఈ సీజన్‌లో ఓర్కాస్‌కు ఇది వరుసగా ఐదో ఓటమి. ఈ ఓటమితో ఓర్కాస్ ప్లే ఆఫ్స్ అవకాశాలు దాదాపుగా గల్లంతైనట్లే.

# ఇంగ్లండ్‌తో రెండో టెస్ట్.. టీమిండియాకు షాకింగ్ న్యూస్..!



ఐదు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్ కోసం ఇంగ్లండ్‌లో పర్యటిస్తున్న టీమిండియా జులై 2 నుంచి బర్మింగ్హామ్ వేదికగా రెండో టెస్ట్ ఆడుతుంది. ఈ మ్యాచ్‌కు ముందు టీమిండియాకు భారీ షాక్ తగిలినట్లు తెలుస్తుంది. స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఈ మ్యాచ్ నుంచి వైదొలిగాడని వార్తలు వినిపిస్తున్నాయి. వర్క్ లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జట్టు యాజమాన్యమే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది.

బుమ్రా తాజాగా ముగిసిన లీడ్స్ టెస్ట్‌లో 44 ఓవర్లు బౌలింగ్ చేశాడు. ఇది అతనిపై అదనపు భారం పడేలా చేసిందని మేనేజ్‌మెంట్ భావిస్తుంది. దీంతో అతనికి రెండో టెస్ట్‌లో విశ్రాంతినిచ్చి, తిరిగి మూడో టెస్ట్‌లో బరిలోకి దించే అవకాశం ఉంది.

ఈ సిరీస్ ప్రారంభానికి ముందే బుమ్రా అన్ని మ్యాచ్‌లు ఆడడని బీసీసీఐ పరోక్షంగా చెప్పింది. వర్క్ లోడ్ కారణంగా స్టార్ పేసర్ కేవలం మూడు మ్యాచ్‌లే ఆడతాడని బోర్డులోని కీలక సభ్యులంతా చెప్పారు.తొలి టెస్ట్‌కు, రెండో టెస్ట్‌కు మధ్య 8 రోజుల గ్యాప్ ఉండటంతో బుమ్రా రెండో టెస్ట్‌లో ఆడతాడని అంతా అనుకున్నారు. ఒకవేళ విశ్రాంతినిచ్చినా, చివరి మూడు టెస్ట్‌ల్లో ఉంటుందని అంచనా వేశారు. అయితే తొలి టెస్ట్‌లో పడిన అదనపు భారం కారణంగా బుమ్రా విషయంలో ప్రణాళికలు మారాయని తెలుస్తుంది. బుమ్రా విషయంలో బీసీసీఐ ఎలాంటి సాహసాలు చేసేందుకు సిద్దంగా ఉండదు. జులై 10 నుంచి లార్డ్‌స్‌లో జరిగే మూడో టెస్ట్‌కు బుమ్రా సిద్దంగా ఉండే అవకాశం ఉంది. 16 రోజుల గ్యాప్‌లో బుమ్రా పూర్తి సన్నద్దత సాధించవచ్చు.

రెండో టెస్ట్‌లో బుమ్రా ఆడకపోతే సిరాజ్ భారత పేస్ విభాగానికి నాయకత్వం వహిస్తాడు. ఇప్పటికే తొలి టెస్ట్ కోల్పోయి సిరీస్‌లో వెనుకపడిన టీమిండియాకు ఇది అంత శుభపరిణాయం కాదు. తొలి టెస్ట్‌లో బుమ్రా మినహా పేసర్లంతా తేలిపోయారు. తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లు తీసిన బుమ్రా కూడా రెండో ఇన్నింగ్స్‌లో ప్రభావం చూపించలేకపోయాడు. రెండో టెస్ట్‌లో బుమ్రా ఆడినా, ఆడకపోయిన భారత బౌలింగ్ విభాగంలో భారీ మార్పులకు ఆస్కారం ఉంది.

ఒకవేళ బుమ్రా ఆడకపోతే ఆకాశ్‌దీప్, అర్షదీప్ సింగ్‌లలో ఎవరో ఒకరికి అవకాశం దక్కుతుంది. బుమ్రా ఆడకుండా, తొలి టెస్ట్‌లో ధారాళంగా పరుగులు సమర్పించుకున్న ప్రసిద్ద్ కృష్ణపై కూడా వేటు పడితే ఆకాశ్‌దీప్, అర్షదీప్ సింగ్ ఇద్దరికీ తుది జట్టులో చోటు దక్కుతుంది.

తొలి టెస్ట్‌లో ఏమాత్రం ప్రభావం చూపించలేకపోయిన శార్దూల్ ఠాకూర్‌పై కూడా వేటు పడే అవకాశం ఉంది. అతని స్థానంలో రిస్ట్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకోవచ్చు. బ్యాటింగ్ విభాగంలో భారత్ ఎలాంటి సాహసాలు చేయకపోవచ్చు.

పూర్తి లైనప్‌ను యధాతథంగా కొనసాగించే అవకాశం ఉంది. తొలి టెస్ట్‌లో సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ విఫలమైన వారికి మరో ఛాన్స్ తప్పక ఉంటుంది. టీమిండియా విషయాన్ని పక్కన పెడితే ఇంగ్లండ్ రెండో టెస్ట్ కోసం జట్టును ప్రకటించింది. ప్రమాదకర పేసర్ జోఫ్రా ఆర్చర్ నాలుగేళ్ల తర్వాత టెస్ట్ ఫార్మాట్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు.